ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

కర్నూలు జిల్లా వార్తలు

5

మంగళవారం 11 నవంబరు 2025


కల్లూరు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం

కల్లూరు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం పరిధిలో 12 గ్రామాలు ఉన్నాయి. దాదాపు 15వేల మంది రైతులు ఈ సంఘం ద్వారా పంట రుణాలు అందుకుంటున్నారు. గత వైసీపీ పాలనలో తెచ్చిన నిబంధనలతో సున్నా వడ్డీ పథకం కింద కేవలం వేయి మంది కూడా అర్హులు కాలేదు. రైతులే ముందుగా వడ్డీ చెల్లిస్తే ఆ తర్వాత ప్రభుత్వం నిధుల లభ్యతను బట్టి ఆ రైతుల బ్యాంకు ఖాతాలకు జమ చేస్తుందనే నిబంధన తీసుకురావడంతో సంఘం పరిధిలోని రైతులు నెత్తి నోరు కొట్టుకుంటున్నారు. మరో వైపు పొలాలను అభివృద్ధి చేసుకునేందుకు పాడిగేదెలు, పొట్టేళ్ల పెంపకంతో తమ జీవనాన్ని మెరుగుపరుచుకునేందుకు అమలు చేసిన సున్నా వడ్డీ పథకాన్ని పూర్తిగా ఎత్తి వేయడంతో ఈ సంఘం కార్యకలాపాలు పూర్తిగా నిర్వీర్యమైపోయాయి.

● కర్నూలు అగ్రికల్చర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి)

ఆ పథకాలేమయ్యాయి?

- సున్నా.. పావలా వడ్డీ పథకాలపై అయోమయం
- ముందు రైతులు చెల్లించాలనే షరతుతో పథకాలకు దూరం
- ఈ-క్రాప్‌తో చిక్కులు
- గత ప్రభుత్వం బాటలోనే కూటమి ప్రభుత్వం వెళ్తోందా?



చెట్లమల్లాపురం గ్రామానికి చెందిన రైతు ఎల్లన్న మార్చి నెలాఖరులో తీసుకున్న రుణానికి వడ్డీ చెల్లించాడు. రెండు సంవత్సరాలైనా ఇతనికి ప్రభుత్వం నుంచి ఈ వడ్డీకి సంబంధించిన మొత్తం బ్యాంకు ఖాతాకు జమ కాలేదు. కల్లూరు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం అధికారుల చుట్టూ తిరుగుతూనే ఉన్నాడు. తమ చేతిలో ఏమీ లేదని ప్రభుత్వం సున్నా వడ్డీ మొత్తాన్ని ఎప్పుడు మీ బ్యాంకు ఖాతాకు జమ చేస్తుందో తమకు తెలీదని ముఖం మీదనే అధికారులు చెప్పారు.



పత్తికొండ, ఎమ్మిగనూరు, మంత్రాలయం, ఆలూరు, డోన్, పాణ్యం నియోజకవర్గాల్లో రైతులు ఖరీఫ్ పంట సాగు పూర్తి కాగానే కుటుంబ జీవనం కోసం వలస బాట పడుతున్నారు. రైతుల కోసం అమలు చేస్తున్న పథకాలను మరింతగా మెరుగులు దిద్ది ఎక్కువ మంది ప్రయోజనం అందుకునేలా చర్యలు చేపట్టాల్సిన పాలకులు లబ్ధిదారుల వడపోత కోసం సవాలక్ష నిబంధనలు పెడుతున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఏటా ఖరీఫ్, రబీ సీజన్లలో 12 లక్షల ఎకరాల్లో రైతులు పత్తి, వరి, మొక్కజొన్న, వేరుశనగ, కంది ప్రధాన పంటలను, కూరగాయలను రైతులు సాగు చేస్తున్నారు. ఈ రైతులు పంట సాగు చేయడానికి సున్నావడ్డీ, పావలా వడ్డీ పథకాలను ప్రభుత్వాలు ఎప్పటి నుంచో అమలు చేస్తున్నాయి.

సున్నా వడ్డీ పథకంపై నీలి నీడలు

గతంలో ఖరీఫ్, రబీ సీజన్లలో రైతులు పంట సాగు కోసం తీసుకుంటున్న పంట రుణాలపై ఏడు శాతం వడ్డీని మాత్రమే వసూలు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయించాయి. ఆ తర్వాత క్రమంగా ఈ వడ్డీని కూడా పేద రైతులకు కట్టాల్సిన అవసరం లేకుండా సున్నావడ్డీ పథకాన్ని అమలు చేస్తున్నాయి. గత వైసీపీ ప్రభుత్వం ఈ సున్నా వడ్డీ పథకం నిబంధనలను మార్చేయడంతో రైతులకు పూర్తి స్థాయిలో ప్రయోజనం అందడం లేదు. ఆ ప్రభుత్వ నిబంధనల మేరకు రైతులు మొదట తాము తీసుకున్న పంట రుణంపై బ్యాంకులకు వడ్డీ చెల్లించాలి. ఆ తర్వాత ప్రభుత్వం నిధుల అందుబాటును బట్టి రైతులు చెల్లించిన వడ్డీని తిరిగి వారి బ్యాంకు ఖాతాలకు జమ చేస్తుంది. ప్రతి సంవత్సరం ఖరీఫ్, రబీ సీజన్లలో తీసుకున్న పంట రుణంపై ఎంత వడ్డీ చెల్లించాలో ఆ వడ్డీని రైతులు ఆ సంవత్సరం మార్చి 31లోపు చెల్లించాలి. ఉదాహరణకు ఖరీఫ్‌లో పంట రుణం తీసుకున్న రైతు ఆ సంవత్సరం మార్చి నెలాఖరులోగా వడ్డీ చెల్లించాలి. గడువులోగా చెల్లించని రైతులకు సున్నా వడ్డీ పథకం వర్తించదు. అదే విధంగా రైతులు సాగు చేసిన పంటను ఖచ్చితంగా ఈక్రాప్‌లో నమోదు చేయించాలి. అయితే.. బ్యాంకుల్లో, సహకార సంఘాల్లో రైతులు తాము వాస్తవంగా సాగు చేసిన పంటను కాకుండా వేరే పంట సాగు చేసినట్లు ఈక్రాప్‌లో నమోదు చేయిస్తున్నారు. ఏ పంటకైతే ఎక్కువ రుణం వస్తుందో ఆ పంటనే తాము సాగు చేసినట్లు బ్యాంకులు, సహకార సంఘాల్లో నమోదు చేయిస్తున్నారు. అయితే.. రైతు సేవా కేంద్రాల్లో ఈక్రాప్ నమోదు ప్రక్రియ చేపట్టే సమయంలో ఏ పొలంలో ఏ పంట సాగు చేశారో ఆ పంటనే అధికారులు నమోదు చేస్తున్నారు. దీని వల్ల గందరగోళ పరిస్థితి ఏర్పడుతున్నది. వాస్తవంగా సాగు చేసిన పంట ఒకటైతే.. రుణం తీసుకున్న బ్యాంకులు, సహకార సంఘాల్లో నమోదైన పంట వేరేగా ఉండటంతో ఆ రైతులకు సున్నావడ్డీ పథకం వర్తించడం లేదు. మొదట ఈ సున్నావడ్డీ పథకం అమలైన సమయంలో రైతులే వడ్డీ చెల్లించాలి.. ఈక్రాప్ జాబితాలో ఏ పంట నమోదైతేనే.. ఆ పంటకే సున్నా వడ్డీ వర్తిస్తుందని నిబంధనలు ఉండేవి కావు.. దీనివల్ల ప్రస్తుతం సున్నా వడ్డీ పథకం ద్వారా ఉమ్మడి జిల్లాలో పంటలు సాగు చేస్తున్న పేద రైతులు నాలుగున్నర లక్షల మంది ఉంటే.. కేవలం వేల సంఖ్యలో రైతులకు మాత్రమే సున్నావడ్డీ పథకం అమలవుతుంది.

ప్రభుత్వ నిర్ణయాలను అమలు చేస్తాం



గత వైసీపీ ప్రభుత్వంలో తీసుకున్న నిర్ణయం మేరకు బ్యాంకుల్లో రుణాలు తీసుకున్న రైతులకు సున్నా వడ్డీ పథకాన్ని అమలు చేశాం. ప్రస్తుత ప్రభుత్వం ఈ పథకంపై ఇంకా ఎటువంటి నిర్ణయాన్ని తీసుకోలేదు. ప్రభుత్వం నుంచి విధి విధానాలు వచ్చిన వెంటనే సున్నా వడ్డీ పథకం అమలుపై చర్యలు తీసుకుంటాం.

●వరలక్ష్మి, వ్యవసాయ శాఖ జేడీ



పావలా వడ్డీని పునరుద్ధరించాలని డిమాండ్

గతంలో పావలా వడ్డీ పథకాన్ని అమలు చేసినట్లే ఇప్పుడు కూడా అమలు చేయాలని కూటమి ప్రభుత్వాన్ని రైతులు కోరుతున్నారు. గతంలో రూ. 3 లక్షల రుణం తీసుకున్న రైతులకు ఈ పథకం వర్తించేది. వైసీపీ ప్రభుత్వం ఈ పథకాన్ని పూర్తిగా ఎత్తివేసింది. సున్నా వడ్డీ పథకాన్ని అమలు చేస్తున్నామని ఈ పథకాన్ని మాయం చేశారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం కూడా పావలా వడ్డీ పథకాన్ని పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. సీఎం చంద్రబాబు నాయుడు సున్నావడ్డీ పథకంపై ఇంకా ఎటువంటి మార్పులు, చేర్పులు చేయకపోవడంతో రైతులు అయోమయ పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగు చేసేందుకు సున్నావడ్డీ పథకంతో పాటు పావలా వడ్డీ పథకాన్ని కూడా అమలు చేయాలని రైతులు కోరుతున్నారు.

సున్నా వడ్డీ పథకం వర్తింపజేయాలి



గత వైసీపీ ప్రభుత్వ హయాంలో సున్నా వడ్డీ పథకం అరకొరగానే అమలు చేశారు. ఉమ్మడి జిల్లాలో నాలుగున్నర లక్షల మంది పంట రుణాలు తీసుకుంటే కేవలం వేల సంఖ్యలోనే రైతులను లబ్ధిదారులుగా చేర్చారు. ఈ ప్రభుత్వం ఈ పథకాన్ని సక్రమంగా అమలు చేయాలి. అలాగే పావలా వడ్డీ పథకాన్ని కూడా పునరుద్ధరించాలి

● రామకృష్ణ, రైతు సంఘం నాయకుడు

హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు భూమిని గుర్తించండి

- అధికారులకు మంత్రి టీజీ భరత్ ఆదేశం


మాట్లాడుతున్న మంత్రి టీజీ భరత్

కర్నూలు కలెక్టరేట్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఏ, బీ, సీ క్యాంపుల్లో హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు తగిన భూమిని గుర్తించాలని పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ అధికారులను ఆదేశించారు. నగరంలోని కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు భూమి గుర్తింపు అంశంపై సోమవారం కలెక్టర్, జాయింట్ కలెక్టర్‌తో కలిసి సంబంధిత శాఖల అధికారులతో మంత్రి టీజీ భరత్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందన్నారు. సమావేశంలో కలెక్టర్ సిరి, జాయింట్ కలెక్టర్ నూరుల్ కమర్, డీఆర్వో వెంకట నారాయణమ్మ పాల్గొన్నారు.

వేరుశనగ ధర పతనం

- కేంద్రం నిర్ణయించిన ధర క్వింటం రూ.7,263
- కర్నూలు యార్డులో 4,958 నుంచి రూ.6,786
- ఆవేదన వ్యక్తం చేస్తున్న రైతులు

కర్నూలు అగ్రికల్చర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): పల్లీల ధర పతనమైంది. కేంద్రం క్వింటంకు రూ.7,263 మద్దతు ధరగా ప్రకటించింది. సోమవారం కర్నూలు మార్కెట్ యార్డుకు వివిధ ప్రాంతాల నుంచి 139క్వింటాళ్ల వేరుశనగ కాయలను రైతులు అమ్మకానికి తెచ్చారు. కనిష్ఠ ధర రూ.1000, మధ్యస్థం రూ.4,958, గరిష్ఠ ధర రూ.6,786 మాత్రమే రైతుకు దక్కింది. రైతులకు మద్దతు ధర దక్కకపోవడంతో తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మిగిలిన పంట ఉత్పత్తులకు కూడా ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరలు అందలేదు. మొక్కజొన్నలకు మద్దతు ధర రూ.2,400 కాగా, కనిష్ఠం రూ.1,439 మధ్యస్థ రూ.1,749, గరిష్ఠం రూ.1,792 మాత్రమే దక్కింది.


అమ్మకానికి తెచ్చిన వేరుశనగ కాయల నిల్వలు

నిధులను వినియోగించుకోండి

- ప్రజల భాగస్వామ్యంతో అభివృద్ధి
- ట్రైనీ ఐఏఎస్‌లు


మాట్లాడుతున్న ట్రైనీ ఐఏఎస్‌లు

మద్దికెర, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): పంచాయతీ అభివృద్ధి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు మంజూరు చేస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని ట్రైనీ ఐఏఎస్‌లు అంకిత్ రాజ్‌పుత్, మోహిత్ మంగల్, భరత్‌దత్ తివారి, తన్మయి మెగ్వాల్ అమర్ బాగిల్ అతుల్ సోనీ అన్నారు. సోమవారం పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ బండారు సుహాసిని అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంచాయతీని ప్రజల భాగస్వామ్యంతో అభివృద్ధి చేయాలన్నారు. ప్రభుత్వ పనితీరుపై పంచాయతీ సభ్యులతో చర్చించారు. స్థానిక సహకార సంఘంలో రైతుల రుణాలు, రికవరీలపై పాలకవర్గాన్ని, సొసైటీ సిబ్బందిని అడిగారు. రైతులకు ఎటువంటి సమస్యలు రాకుండా చూడాలన్నారు. ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు ఎలాంటి సేవలు అందు తున్నాయని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నుంచి అన్ని సహాయ సహకారాలు అందుతుండటంతో సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ ఆనంద్ కుమార్, ప్రభుత్వ వైద్యాధికారి రాగిణి, సూపర్‌వైజర్ త్రివేణి, పంచాయతీ కార్యదర్శి శివకుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మయాంక్, సొసైటీ సభ్యులు సుగ్గలప్ప, చిన్న పెద్దన్న, ఉప సర్పంచ్ కవిరెడ్డి కృష్ణ, పంచాయతీ సభ్యులు ఎస్.లక్ష్మినారాయణ, బాలచంద్ర ఉన్నారు.

గ్రామ పాలనపై ట్రైనీ కలెక్టర్ల బృందం అవగాహన

చిప్పగిరి: గ్రామ పాలనపై అవగాహన పొందేందుకు శిక్షణ పొందుతున్న ఐఏఎస్ అధికారులు రాజట్ యాదవ్, నిధి, అశుతోష్‌శుక్లా చిప్పగిరిలో సోమవారం పర్య టించారు. పాఠశాలలు, ఆసుపత్రి, చెత్తశుద్ధి కేంద్రం, అంగన్‌వాడీ కేంద్రాలను పరి శీలించారు. ఆయా శాఖలపై సమీక్షించారు. తహసీల్దార్ ఎజాజ్ అహమ్మద్, ఎంపీడీవో అల్లాబకాష్, డిప్యూటీ ఎంపీడీవో నాగరాజు, పీఆర్ ఏఈ సోమన్న, ఏఓ శ్రీరామ్‌ప్రవీణ్, సూపరింటెండెంట్ శ్రీనివాసులు, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరెడ్డి, ఆర్ఐ సునీత, పంచాయతీ కార్యదర్శులు, పోలీసులు పాల్గొన్నారు.

'పందికోన'లో ఆగని వేట..!

- రెచ్చిపోతున్న అక్రమార్కులు
- లక్షలాది రూపాయల ప్రభుత్వ సొమ్ము దోపిడీ
- పట్టించుకోని మత్స్యశాఖ అధికారులు
- వేలం ఎప్పుడో?

7

రైతులకు అండగా ఉంటాం

- వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు

అత్యాధునిక ఆయుధాలను సమకూరుస్తాం

- ఉద్యోగులు అంకితభావంతో పనిచేయాలి
- అటవీ సంరక్షణాధికారి జీవీఏ కృష్ణమూర్తి

కర్నూలు రాజ్‌విహార్ సర్కిల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): అటవీ సంపద, వన్యప్రాణి సంరక్షణ కోసం ప్రభుత్వం నూతన నియామకాలతో పాటు, అత్యాధునిక ఆయుధాలను సమకూర్చేందుకు సిద్ధంగా ఉందని అటవీ సంరక్షణాధికారి జీవీఏ కృష్ణమూర్తి తెలిపారు. సోమవారం సీఎఫ్ కార్యాలయ ప్రాంగణంలో రాష్ట్ర అటవీ అమరవీరుల సంస్మరణ దినాన్ని పురస్కరించుకుని స్మారక స్థూపానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం దేశంలో ఏదో ఒక ప్రాంతంలో అటవీ ఉద్యోగులపై దాడులు జరుగుతూనే ఉన్నాయని, దీనిని ప్రభుత్వం సైతం


అమర వీరుల స్మారక స్థూపం వద్ద నివాళి అర్పిస్తున్న సీఎఫ్, డీఎఫ్‌వో

తీవ్రంగా పరిగణించి, శాఖకు మద్దతుగా చర్యలు తీసుకుంటుందన్నారు. అడవులను కాపాడటంలో అటవీ ఉద్యోగులు అంకితభావంతో పనిచేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అటవీశాఖ అధికారి శ్యామల, ఎఫ్ఆర్వో విజయకుమార్, రమణారెడ్డి, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీ పేలుళ్ల ఘటనతో.. పోలీసు యంత్రాంగం అప్రమత్తం

- స్వయంగా తనిఖీలు చేసిన ఎస్పీ

కర్నూలు క్రైం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో ఎర్రకోట వద్ద భారీ పేలుడు జరిగిన నేపథ్యంలో కర్నూలు జిల్లా పోలీస్ యంత్రాంగం అప్రమత్తమైంది. పలు చోట్ల తనిఖీలు చేపట్టారు. జిల్లాలో ఏకకాలంలో ముమ్మరంగా ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. స్థానిక గుత్తి పెట్రోల్ బంకు సమీపంలో ఎస్పీ విక్రాంత్ పాటిల్ స్వయంగా తనిఖీల్లో పాల్గొన్నారు.


తనిఖీలు చేస్తున్న పోలీసులు

భారీ పేలుడు సంఘటన నేపథ్యంలో పోలీసు బృందాలు వాహన తనిఖీలు ముమ్మరం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

పారిశ్రామిక నగరి ఓర్వకల్లు

- డ్రోన్ అండ్ రోబోటిక్ హబ్
- వంద ఎకరాల్లో సింథటిక్ ఆర్గానిక్ కెమికల్ యూనిట్
- సెమీ కండక్టర్స్ యూనిట్‌కు 150 ఎకరాలు
- ఈ పరిశ్రమ ప్రతిపాదిత పెట్టుబడి అంచనా రూ.22,976 కోట్లు
- మంత్రివర్గం ఆమోదం

కర్నూలు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఓర్వకల్లు పారిశ్రామిక నగరిగా మరింతా అభివృద్ధికి సీఎం చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం బీజం వేసింది. సీఎం చంద్రబాబు అధ్యక్షతన సోమవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఓర్వకల్లు కేంద్రంగా పలు పరిశ్రమలకు భూములు కేటాయిస్తూ కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఇప్పటికే.. కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలం గుమ్మటంతండా, నంద్యాల జిల్లా పాణ్యం మండలం పిన్నాపురం గ్రామాల మధ్య గ్రీన్‌కో ఎనర్జీస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ 4,766.28 ఎకరాలో 5,230 మెగావాట్ల పవర్ ఉత్పత్తి సామర్థ్యంతో నిర్మించిన ఇంటిగ్రేటెడ్ రెన్యూవబుల్ ఎనర్జీ స్టోరేజ్ ప్రాజెక్టు (ఐఆర్ఏఎస్‌పీ) దేశంలోనే తొలి ప్రాజెక్టు ఇది. ఈ ప్రాజెక్టులో భాగంగా 1,680 మెగావాట్లు స్టోరేజ్ హైడ్రోపవర్ ప్రాజెక్టు (పీఎస్‌హెచ్‌పీ), 3 వేల మెగావాట్లు సోలార్, 550 మెగావాట్లు విండ్ పవర్ ఉత్పత్తి చేస్తారు. ఒకే చోట మూడు రకాల విద్యుత్ ఉత్పత్తి చేసి, నిల్వ చేసే ప్రపంచంలోనే అతిపెద్ద ప్రాజెక్టు. ఓర్వకల్లు


ఓర్వకల్లు వద్ద నిర్మించిన జైరాజ్ ఇస్పాత్ ఐరన్ పరిశ్రమ

సమీపంలో 415 ఎకరాల విస్తీర్ణంలో జైరాజ్ ఇస్పాత్ ఉక్కు పరిశ్రమకు 2017లో ఆనాటి సీఎం చంద్రబాబు పునాది రాయి వేశారు. దాదాపు రూ.3 వేల కోట్లు పెట్టుబడితో ఈ పరిశ్రమను ప్రారంభించారు. 0.45 మిలియన్ టన్నుల స్టీల్ ఉత్పత్తి సామర్థ్యం. వంద శాతం పనులు పూర్తి చేసుకొని ట్రయల్ రన్ ఉత్పత్తిని కూడా చేపట్టింది. ఈ రెండు పరిశ్రమలు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి. తాజాగా ఓర్వకల్లు ఇండస్ట్రియల్ నోడ్ కారిడార్‌లో రూ.22,976 కోట్ల పెట్టుబడి అంచనాతో స్థాపించే సెమీ కండక్టర్స్ యూనిట్‌కు రాయితీపై 150 కేటాయించారు. ఈ పరిశ్రమ ద్వారా 1,241 మందికి ఉద్యోగాలు వస్తాయని అంచనా. ఓర్వకల్లు కేంద్రంగా డ్రోన్ అండ్ రోబోటిక్ డ్రోన్ సిటీ ఏర్పాటుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. అలాగే.. సిగాచి ఇండస్ట్రీస్ లిమిటెడ్ రూ.1,090 కోట్లతో అంచనాతో స్థాపించనున్న సింథటిక్ ఆర్గానిక్ కెమికల్స్ యూనిట్‌కు 100 ఎకరాలు కేటాయించారు. ఏడాది 255,950 టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో స్థాపించే ఈ సంస్థ ద్వారా 1,200 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు తలభించనున్నాయి.

శ్రీశైలంలో కార్తీక శోభ


పుష్కరిణికి హారతిలో పాల్గొన్న భక్తులు

శ్రీశైలం నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ద్వాదశ జ్యోతిర్లింగం, అష్టాదశ శక్తి పీఠమైన శ్రీశైల పుణ్యక్షేత్రం కార్తీక శోభతో కళకళలాడుతోంది. కార్తీకమాసం సోమవారం కావడంతో తెల్లవారుజాము నుంచే పాతాళ గంగలో పుణ్యస్నానాలను చేసుకొని కృష్ణమ్మకు దీపాలను వెలిగించి పసుపు కుంకుమలతో సారెను సమర్పించారు. భక్తులు క్యూలైన్‌ల్లో బారులు దీరారు. స్వామి, అమ్మవార్ల దర్శనానికి రెండు గంటల సమయం పట్టిందని అధికారులు తెలిపారు. కార్తీక మాసాంతం శని, ఆది, సోమవారాలతో పాటు ప్రభుత్వ సెలవు రోజులు భక్తులందరికీ అలంకార దర్శనం కల్పిస్తున్నట్లు ఈవో శ్రీనివాసరావు అన్నారు.

లక్ష దీపోత్సవం.. పుష్కరిణికి దశవిధ హారతులు

సోమవారం సాయంకాలం స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను పుష్కరిణి వద్దకు తోడ్కొనివచ్చి ప్రత్యేక పుష్పాలతో అలంకరించిన వేదికపై పూజా క్రతువులు జరిపించారు. స్వామి, అమ్మవార్లతోపాటు పుష్కరిణికి దశవిధ హారతులను ఇచ్చారు. చైర్మన్ రమేష్‌నాయుడు, ఆలయ పీఆర్‌వో శ్రీనివాసరావు, ఈఈ నర్సింహరెడ్డి పాల్గొన్నారు.

ఎస్‌ఏ-1 పరీక్షలు ప్రారంభం

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలలో సోమవారం సమ్మేటివ్ అసెస్‌మెంట్-1 పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఈ పరీక్షలు ఈ నెల 19వ తేదీ వరకు కొనసాగుతాయి. సోమవారం 6వ తరగతి నుంచి పదో తరగతి వరకు తెలుగు సబ్జెక్టు పరీక్షలు జరిగాయి. జిల్లాలో ప్రభుత్వ యాజమాన్యాల పాఠశాలలో 6వ తరగతి విద్యార్థులు 30,315 మంది, 7వ తరగతి విద్యార్థులు 34,316 మంది, 8వ తరగతి విద్యార్థులు 31,363 మంది, 9వ తరగతి విద్యార్థులు 30,246 మంది, 10వ తరగతి విద్యార్థులు 27,793 మంది పరీక్షలకు హాజరు కావాల్సి ఉంది. ఈ పరీక్షలను జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ పాల్ ఆధ్వర్యంలో ఉప విద్యాశాఖ అధికారులు, మండల విద్యాశాఖ అధికారులు పర్యవేక్షించారు.



జల సంపదలో పశు సంపద

సుంకేసుల జలాశయం నిండు కుండలా ఉంది. జల సిరితో శోభాయమానంగా కనిపిస్తోంది. అధికారులు మూడు గేట్లను సోమవారం ఎత్తేశారు. జలాశయానికి అవతలి వైపు ఉన్న రాజోలి నుంచి వచ్చిన పశువులు నీటిలో ఈదుకుంటూ వెళ్లాయి. పశువులను మేపు కోడానికి వచ్చిన వారు నీటి ఉధృతిని దాటడానికి వాటి తోకలు పట్టుకొని ఈదుకుంటూ వెళ్లారు. ఆంధ్రజ్యోతి కెమెరా క్లిక్‌మనిపించింది.

- ఫొటోలు: స్టాఫ్ ఫొటోగ్రాఫర్



ఐఐఐటీడీఎం, ఆర్‌యూ మధ్య ఎంవోయూ



ఒప్పందం పత్రంపై సంతకం చేసిన ఐఐఐటీ డీఎం ప్రొఫెసర్ బీఎస్ మూర్తి, ఆర్‌యూ వైస్ చాన్సలర్ బసవరావు

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కర్నూలు ఐఐఐటీడీఎం, రాయలసీమ యూనివర్సిటీ(ఆర్‌యూ) విద్యాసంస్థల మధ్య విద్య, పరిశోధన సహకారానికి సంబంధించి ఎంవోయూ ఒప్పందంపై అధికారులు సంతకాలు చేశారు. ఐఐఐటీ డీఎం డైరెక్టర్ ప్రొ. బీఎస్ మూర్తి, ఆర్‌యూ వీసీ బసవరావు సోమవారం ఒప్పంద పత్రాలు మార్చుకున్నారు. ఈ భాగస్వామ్యం ఉమ్మడి పరిశోధన పాఠ్యాంశాల అభివృద్ధి, అధ్యాపకులు, విద్యార్థుల మార్పిడి, కృత్రిమ మేధస్సు, డేటా సైన్స్, సైబర్ సెక్యూరిటీ, బ్లాక్ చైన్, ఎలక్ట్రిక్ టెక్నాలజీ వంటి అభివృద్ధి చెందుతున్న రంగాల్లో ఆవిష్కరణల చొరవలను మెరుగుపరచడం లక్ష్యంగా ఈ ఒప్పందం కుదిరింది. స్టార్టప్ ఇంక్యుబేషన్‌కు మద్దతు ఇవ్వడానికి వర్క్‌షాపులు, సమావేశాలు నిర్వహించడానికి ఉమ్మడి పరిశోధనలకు అవసరమైన నిధులు కోరడానికి కూడా రెండు సంవత్సరాలు కలిసి పని చేస్తాయి. ఈ అవగాహన ఒప్పందం రెండేళ్ల పాటు అమలులో ఉంటుంది.

పెండింగ్ ఫీజులు విడుదల చేయాలి

- ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వలరాజు
- కర్నూలులో బస్సు జాతా ప్రారంభం



సమావేశంలో మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వలరాజు

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విద్యాసంస్థల్లో విద్యార్థులకు పెండింగ్ ఉన్న రూ.6,400 కోట్ల ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు జి. వలరాజు, నాసర్ జీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో స్థానిక సీపీఐ కార్యాలయం నుంచి ర్యాలీగా బయలుదేరి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించి ఏ. క్యాంపులోని హార్ట్ అండ్ బ్రెయిన్ ప్రాంగణం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా విద్యారంగంలో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో విద్యార్థులకు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన ఈ ప్రభుత్వంలో విద్యాశాఖ మంత్రి ఏ ఒక్కటీ అమలు చేయడం లేదని ఆరోపించారు. నారా లోకేశ్ విద్యామంత్రిగా వంద శాతం మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీని వల్ల పేద విద్యార్థులకు వైద్యవిద్య దూరం అవుతుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వసతి గృహాల్లోని సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. జీవో.నెం.77ను రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మాజీ జాతీయ కార్యదర్శి లెనిన్‌బాబు, రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు చంద్రశేఖర్, మస్తాన్, ఫణీంద్ర, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సోమన్న, షాబీర్‌బాషా పాల్గొన్నారు.

నిబద్ధతతో పని చేయండి: ఎస్పీ

నంద్యాల టౌన్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో అలసత్వం లేకుండా నిబద్ధతతో పని చేయాలని ఎస్పీ సునీల్ షెరాన్ అన్నారు. సోమవారం ఎస్పీ కార్యాలయంలో నంద్యాల, ఆళ్లగడ్డ యూనిట్‌లో పనిచేస్తూ జాఫర్‌వలి, ఖాజాపీర్ అనారోగ్యంతో చనిపోయారు. వారి కుటుంబ సభ్యులకు హోంగార్డులుగా నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఖాజాపీర్ భార్య జహీర్‌బీ, జాఫర్ వలి భార్య తయాబాబేగంకు హోంగార్డులుగా జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. పోలీసు శాఖ ఎల్లప్పుడు అండగా ఉంటుందన్నారు. వారి వారి యూనిట్లలో నిజాయితీగా పనిచేసి మంచిపేరు తీసుకురావాలన్నారు.

కార్తీక సందడి



యాగంటిలో కార్తీక సోమవారం సందర్భంగా స్నానమాచరిస్తున్న భక్తులు

ఉమా మహేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

బనగానపల్లె, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని యాగంటి క్షేత్రంలో కార్తీక మూడో సోమవారం భక్తుల సందడి నెలకొంది. ఉదయం ఉమామహేశ్వరస్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహాన్యాసక పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, కుంకుమార్చన సహస్రనామావళి, ప్రసాద వితరణ, వివిధ ప్రాంతాలనుంచి వచ్చిన భక్తులు శ్రీ ఉమామహేశ్వరస్వామి ఆలయం పుష్కరిణి వద్ద స్నానమాచరించారు. యాగంటి బసవయ్య, ఉమామహేశ్వరస్వామిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి పల్లకీసేవ కార్యక్రమాలు నిర్వహించారు. ఓంకార నామస్మరణతో మార్మోగింది. యాగంటి బసవయ్యను, ఉమామహేశ్వర స్వామివారిని దర్శించుకున్న అనంతరం వేంకటేశ్వరగవి వద్ద వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ అసిస్టెంట్ మేనేజరు పాండురంగారెడ్డి, యాగంటి పల్లె ఉపసర్పంచ్ మౌళీశ్వరరెడ్డి ఏర్పాట్లు చేశారు. భక్తులకు క్యూలైన్‌లోనే తాగునీటి వసతి కల్పించారు. మహిళలు కార్తీక దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. ఉమామహేశ్వర నిత్యాన్నసంస్థ, ఉమామహేశ్వరరెడ్డి అన్నదాన సంస్థ, ఉమామహేశ్వర ఆర్యవైశ్య అన్నదాన సంస్థలో భక్తులకు ఉచిత భోజన వసతి కల్పించారు. పసుపుల గ్రామ సమీపంలోని గుండం మల్లికార్జున స్వామి, పలుకూరులోని రామేశ్వరస్వామి, రామతీర్థంలో వెలసిన బుగ్గరామేశ్వర ఆలయాల్లో భక్తుల సందడి నెలకొంది.



యాగంటిలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు

మహానందికి పోటెత్తిన భక్తులు

- పాలు, బిస్కెట్ల పంపిణీ
- వైభవంగా జల హారతి

మహానంది, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం మూడో సోమవారం మహానంది క్షేత్రానికి భక్తులు పోటెత్తారు. మహానందీశ్వరుని దర్శనం కోసం ఆది వారం రాత్రే తెలుగు రాష్ట్రాల నుండే కాక కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు నుంచి క్షేత్రానికి చేరుకున్నారు. సోమవారం తెల్లవారుజామునే ఆలయ ప్రాంగణంలోని కోనేర్లల్లో భక్తులు పుణ్య స్నానాలచరించారు. ఆలయంలో అర్చకులు పూజలతో పాటు స్వామి, అమ్మవార్లకు నిర్వహించే మహామంగళ హారతి సేవలను జరిపి భక్తులకు దర్శనం కల్పించారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆలయ ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి, ఏఈవో మధు ఆధ్వర్యంలో సిబ్బంది ప్రత్యేక ఏర్పాట్లు చేసారు. దాతల సహకారంతో దర్శనం తర్వాత భక్తులకు ఉచితంగా పాలు, బిస్కెట్లను ఈవో పంపిణీ చేశారు. దేవస్థానానికిరూ.12లక్షల ఆదాయం వచ్చినట్లు తెలిపారు. రాత్రి ఆలయం రెండవ ప్రాకారంలోని కోనేర్లకు ఆలయ వేదపండితులు, అర్చకులు వైభవంగా జల హారతి ఇచ్చారు. గంగాదేవికి వేదమంత్రాలతో ఈవో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్ర మంలో వేలాదిమంది భక్తులు పాల్గొన్నారు. ఆలయ ముందు భాగంలో నిర్వహించిన కోలాట నృత్యం పలువురిని ఆకట్టుకుంది.



మహానంది ఆలయం క్యూ లైన్లలో భక్తులు

అభివృద్ధికి నోచుకోని పశ్చిమ ప్రాంతం

- పాలకుల నిర్లక్ష్యంతో ఎడారిగా మారుతున్న వైనం
- ప్రభుత్వంపై సీపీఎం మాజీ ఎమ్మెల్యే గఫూర్ మండిపాటు



ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

ఆదోని, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాలోని పశ్చిమ ప్రాంతం పాలకవర్గాల నిర్లక్ష్యం, నిరాదరణకు గురై అభివృద్ధికి దూరంగా, నిత్య వలసల కేంద్రంగా మారిపోయిందని సీపీఎం మాజీ కేంద్ర కమిటీ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే ఎం.ఎ. గఫూర్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ప్రాంతాన్ని ఎడారిగా మారుస్తున్న పాలకుల తీరును నిరసిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో రెండు రోజులపాటు పాదయాత్రలు నిర్వహించి సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు మహా ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్నూలు జిల్లా నుంచి ముఖ్యమంత్రులు, కేంద్ర మంత్రులు, రాష్ట్ర మంత్రులుగా ఎందరో ఉన్నత పదవులను అనుభవించినా జిల్లాకు ఒరిగిందేమీ లేదన్నారు. వందల టీఎంసీల కృష్ణా జలాలు ఈ మండలాల మీదుగా వృథాగా సముద్రంలోకి పోతున్నా, వాటిని ఒడిసి పట్టుకుని తాగునీరు, సాగునీటికి వినియోగించుకునే భాగ్యం ఈ ప్రాంత ప్రజలకు కలగడం లేదన్నారు. ఆదోని, ఆలూరు, హొళగుంద, చిప్పగిరి, హాలహర్వి, కౌతాళం, కోసిగి, పెద్దకడబూరు, ఆస్పరి మండలాల ప్రజలు కేవలం ప్రకృతి దయా దాక్షిణ్యాలపై ఆధారపడి వ్యవసాయం చేస్తూ నిత్యం అనావృష్టితో బతుకుతున్నారన్నారు. గత 50 ఏళ్లుగా ప్రజలు అడుగుతున్న వేదవతి ప్రాజెక్టు, నగరడోన రిజర్వాయర్, తుంగభద్ర నది ద్వారా వరద కాలువ, ఆర్డీఎస్ కుడి కాలువ నిర్మాణాలు నేటికీ పూర్తి కాలేదన్నారు. వ్యవసాయ ఆధారిత ఉల్లి, టమాటా, ఖనిజ ఆధారిత పరిశ్రమలను ఈ ప్రాంతంలో ఏర్పాటు చేయాలన్నారు. రైతులు పండించే పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం సీనియర్ నేతలు రాధాకృష్ణ, వెంకటేశ్వర్లు, నారాయణ, అంజిబాబు, లింగన్న, రామాంజనేయులు పాల్గొన్నారు.

అందెశ్రీ మరణం సాహితీలోకానికి తీరని లోటు

- అరుణ భారతి సాహితీ సాంస్కృతిక సంస్థ అధ్యక్షుడు రాజారెడ్డి

బనగానపల్లె, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): తెలంగాణ సాహితి శిఖరం ప్రజాకవి అందెశ్రీ మరణం సాహితీలోకానికి తీరని లోటు అని బనగానపల్లె పట్టణ మాజీ సర్పంచ్, అరుణ భారతి సాహితీ సాంస్కృతిక సంస్థ అధ్యక్షుడు బీసీ రాజారెడ్డి అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో తన అక్షరాన్ని ఇంధనంగా మార్చి ప్రజల్లో నిత్య చైతన్యాన్ని రగిల్చిన గొప్ప కలం యోధుడు అని కొనియాడారు. నిత్యం పేదల పక్షాన గొంతుకను వినిపించిన నిస్వార్థపరుడు అన్నారు. తెలంగాణ మట్టి మనిషి అందెశ్రీ అన్నారు. అందెశ్రీతో తనకు వ్యక్తిగతంగా కూడా మంచి పరిచయం ఉందన్నారు. అందెశ్రీ భౌతికంగా మనమధ్య లేకపోయినా తెలంగాణ రాష్ట్ర అధికారిక గీతమైన జయజయహే తెలంగాణాజననీ జయకేతనం గేయం, ఆయన రచనలు, సాహిత్యం నిత్యం ప్రజల గుండెల్లో నిలిచి ఉంటాయన్నారు. ఆయన ఆత్మకు చేకూరాలని ఆ భగవంతున్ని ప్రార్థిస్తూ వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు.

సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలి

- ఆర్ఐవో లాలెప్ప



మాట్లాడుతున్న ఆర్ఐవో లాలెప్ప

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలని ఆర్ఐవో జి. లాలెప్ప పేర్కొన్నారు. సోమవారం స్థానిక స్టాంటన్‌పురంలో కేవీఆర్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ స్పెషల్ క్యాంప్‌ను కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ప్రభు చరణ్ ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా లాలెప్ప మాట్లాడుతూ జాతీయ సేవా పథకం ద్వారా సేవా దృక్పథంతో పాటు జాతీ య సమైక్యతను అలవర్చుకోవాలని సూచించారు. చదువుతో పాటు ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొనడంతో వారిలో సృజనాత్మకత పెరిగి సమాజంలో తమ బాధ్యతలు తెలుసుకుంటారన్నారు. ఈ క్యాంపు పరిసరాల్లో సేవా కార్యక్రమాలు ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ మౌనిక, ఎన్ఎస్ఎస్ పీవో రేష్మా, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

పూల్ క్యాంపస్ డ్రైవ్ ప్రారంభం

- ఏపీ ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహణ
- ఉమ్మడి కర్నూలు, అనంతపురం, కడప జిల్లాల నుంచి హాజరైన 1700 మంది బీటెక్ ఫైనలియర్ విద్యార్థినులు



పూల్ క్యాంపస్ డ్రైవ్‌కు హాజరైన విద్యార్థినులు

పాణ్యం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా పాణ్యం మండలంలోని ఆర్జీఎం ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం పూల్ క్యాంపస్ డ్రైవ్ ప్రారంభమైంది. మూడు రోజుల పాటు ఆంధ్రప్రదేశ్ ఇన్‌ఫర్‌మేషన్ టెక్నాలజీ అకాడమీ ఆధ్వర్యంలో ఇన్ఫోసిస్ కంపెనీలో ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఆర్జీఎం కళాశాల డైరెక్టర్ అశోక్‌కుమార్ తెలిపారు. ఇంత పెద్ద స్థాయిలో ప్రాంగణ ఎంపికలు నిర్వహించడం ఇదే ప్రథమమని తెలిపారు. రాయలసీమ పరిధిలోని కర్నూలు, నంద్యాల, కడప, అన్నమయ్య, అనంతపురం, సత్యసాయి జిల్లాల నుంచి 1700 మంది విద్యార్థినులు హాజరైనట్లు తెలిపారు. ఇందులో పాల్గొనే విద్యార్థినులకు మౌఖిక రాత పరీక్షలు, ఇంటర్వ్యూలు నిర్వహించి ఎంపిక చేస్తున్నట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థినులకు వార్షిక వేతనం రూ. 3.6 లక్షలు చొప్పున ఇవ్వనున్నట్లు తెలిపారు. ఎంపికలో పాల్గొన్న విద్యార్థినులకు కళాశాల ఆధ్వర్యంలో అన్ని వసతులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యార్థినులు తమ లక్ష్య సాధనలో ముందుండాలని ఇన్ఫోసిస్ ప్రతినిధి హర్షదీప్ పత్ర భవిష్యత్తుపై దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అకాడమీ రాష్ట్ర ఇన్‌చార్జి సత్యరత్నం, ప్రిన్సిపాల్ డాక్టర్ జయచంద్రప్రసాద్, కళాశాల ప్రాంగణ అధికారి డాక్టర్ సుధీర్‌కుమార్, పాల్గొన్నారు.

మద్దతు ధర లేని మొక్క జొన్న

- కుదేలవుతున్న రైతులు
- కొనుగోలు కేంద్రాల కోసం ఎదురు చూపు



తడిసిన మొక్కజొన్నను చూపుతున్న రైతులు

కొలిమిగుండ్ల, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఆరుగాలం శ్రమించే రైతులను అడుగడుగునా కష్టాలు వెంటాడుతూనే ఉన్నాయి. ప్రకృతి వైపరీత్యాల కారణంగా తీవ్రంగా నష్టపోయిన అన్నదాతలకు ప్రభుత్వ సహకారం కూడా కరువై ఆవేదన చెందుతున్నారు. జిల్లాలో విస్తారంగా సాగు చేసిన మొక్క జొన్నకు మద్దతు ధర కరువైంది. సాగు చేసిన దగ్గర నుండి చీడపీడలు, భారీ వర్షాల నుండి తీవ్ర కష్టాలను ఎదుర్కొని పండించిన పంటకు చివరకు సరైన ధరలేక తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోందని ఆవేదన చెందుతున్నారు. గతంలో క్వింటం రూ.3000, 3500 వరకు పలికిన మొక్క జొన్న ప్రస్తుతం రూ.1500, 1700 మించకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. కోతలు ఆరంభమైనప్పుడు రూ.2100 పలికిన మొక్క జొన్న ధర రోజు రోజుకూ పడిపోతోంది. ఒక్కసారిగా రూ.1500 పడిపోవడంతో అన్నదాతల ఆశలపై నీళ్లు చల్లినట్లయ్యింది. ఈ ఏడాది జిల్లా వ్యాప్తంగా 64వేల ఎకరాల్లో మొక్క జొన్న సాగైంది. ప్రధానంగా కోవెలకుంట్ల, నంద్యాల, ఆళ్లగడ్డ, నందికొట్కూరు తదితర డివిజన్లలో మొక్క జొన్న అధికంగా సాగు చేశారు. మరోవైపు ఇటీవల ఇటీవల కురిసిన మొంథా తుఫాన్ వల్ల మొక్క జొన్న రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. జిల్లా వ్యాప్తంగా 10,800 ఎకరాల్లో మొక్క జొన్న పంటకు నష్టం కలిగినట్లు అధికారులు అంచనా వేశారు. ఇందులో ప్రధానంగా బనగానపల్లె నియోజకవర్గంలోనే 8వేల ఎకరాల్లో మొక్క జొన్న దెబ్బతినడంతో రైతుల ఆవేదనకు అంతు లేకుండా పోయింది. తడిసిన ధాన్యంతో పాటు, ఇతర దిగుబడిని మార్కెట్లో అమ్ముదామంటే గిట్టుబాటు ధర లేదని అన్నదాతలు వాపోతున్నారు. ప్రకృతి ప్రకోపంతో నష్టపోయిన అన్నదాతలకు గిట్టుబాటు ధర కూడా లేకపోవడంతో కష్టాలు తప్పడంలేదు.

కనిపించని కొనుగోలు కేంద్రాలు: ప్రభుత్వం రూ.2400 మద్దతు ధరలతో మొక్క జొన్న కొనుగోలు చేస్తామని ప్రకటించింది. అయితే అది నేటికీ కార్యరూపం దాల్చక పోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లా వ్యాప్తంగా మొక్క జొన్న కొనుగోలు కేంద్రాల కోసం అన్నదాతలు ఎదురుచూస్తున్నారు. మార్క్‌ఫెడ్ ద్వారా మొక్క జొన్న కొనుగోలు ప్రారంభిస్తామని అధికారులు చెబుతున్నా, తడిసిన ధాన్యం ఎక్కువ రోజులు ఉంచుకునే పరిస్థితి లేక రైతులు తక్కువ ధరకు విక్రయిస్తూ నష్టపోతున్నారు. ప్రభుత్వం త్వరితగతిన కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

మద్దతు ధర రూ.3000 అందించాలి: మొక్క జొన్న సాగుచేసి తీవ్రంగా నష్టపోయామని ప్రభుత్వం క్వింటాలుకు కనీస మద్దతు ధర రూ.3000 చెల్లించాలని రైతులు కోరుతున్నారు. మొక్క జొన్న నూర్పిడి చేసిన రైతులు ధాన్యం తడిసి నష్టపోగా, నూర్పిడి చేయని రైతులు కూడా పంట నష్టపోయారు. కంకులు నల్లగా మారి, మొక్క జొన్న నాణ్యతలేమిగా మారిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలని కోరుతున్నారు.



రైతులు రహదారిలో ఆరబెట్టుకున్న మొక్కజొన్న

త్వరలో కొనుగోలు కేంద్రాలు



జిల్లాలో మొక్క జొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయమని ప్రభుత్వం ఆదేశించింది. మార్క్‌ఫెడ్ ద్వారా త్వరలోనే ఏర్పాటు చేసి క్వింటం రూ.2400 మద్దతు ధరతో కొంటాం.

- సుధాకర్, వ్యవసాయ శాఖ ఏడీఏ

వేర్వేరు ప్రమాదాల్లో ఒకరి మృతి

- ఇద్దరికి తీవ్ర గాయాలు



ప్రమాదానికి గురైన వాహనాలు

కర్నూలు క్రైం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): నగర శివారులో సోమవారం జరిగిన రెండు వేర్వేరు ప్రమాదాల్లో ఒకరు మృతిచెందారు. మరో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. తాలుకా పోలీస్‌స్టేషన్ పరిధిలో హైదరాబాద్ జాతీయ రహదారిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ తమిళనాడు డ్రైవర్ శివాజీ గణేష్(35) మృతి చెందాడు. రోడ్డుపై వెళ్తున్న బైక్ కిందపడటంతో ఇద్దరు యువకులు గాయపడ్డారు. వారిని తప్పించే క్రమంలో వెనుకాల వస్తున్న ఓకంటైనర్ రోడ్డుకు ఓ పక్కకు వచ్చి సడెన్ బ్రేక్ వేశారు. దీని వెనుక తమిళనాడు చెందిన ఐచర్ వచ్చి కంటైనర్‌ను ఢీకొట్టింది. కంటైనర్‌లో ఉన్న డ్రైవర్ తీవ్రంగా గాయపడటంతో ఆయను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే తమిళనాడు వాసి మృతి చెందాడు. ఈ ప్రమాదంలో ఐచర్ వెనుకవస్తున్న మరో కారు కూడా ఐచర్‌ను ఢీకొట్టింది. కారులో ఉన్న వారికి స్వల్పగాయాలయ్యాయి. వీరిని కూడా చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

● బళ్లారి చౌరస్తా ఫ్లైఓవర్ వద్ద నారాయణపేట జిల్లా కోసిగి మండలం పోతిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన కొంత మంది ఓమినీ వాహనంలో తిరుమల వెళ్తున్నారు. వీరి వాహనాన్ని వెనుక వైపు నుంచి వస్తున్న ఓలారీ బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వాహనంలో ఉన్న పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. ఓమినీ డ్రైవర్ వెంకటయ్య ఫిర్యాదు మేరకు లారీ డ్రైవర్‌పై ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేశారు.

కిడ్నాప్ కేసులో నిందితుడి అరెస్టు

కర్నూలు క్రైం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): నాలుగేళ్ల బాలిక కిడ్నాప్ కేసులో నిందితుడిని అరెస్టు చేసినట్లు సీఐ విక్రమసింహ తెలిపారు. వివరాలు.. నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్



అరెస్టును చూపుతున్న పోలీసులు

పరిధిలో ఈ నెల 8వ తేదీన నాలుగేళ్ల బాలిక రేణుకను కిడ్నాప్ చేసిన కేసులో నిందితుడు మధు అనే వ్యక్తిని పోలీసులు అరెస్టుచేశారు. వెల్దుర్తి మండలం బుక్కాపురానికి చెందిన మధు కర్నూలు ముజఫర్‌నగర్‌లో నివాసముంటున్నాడు. బాలిక తల్లి సునీత కర్నూలులో భిక్షాటన చేసుకుంటూ బళ్లారి చౌరస్తా సమీపంలో ఆంజనేయస్వామి ఆలయం వద్ద నిద్రి స్తుంటారు. ఈనెల 8వ తేదీ తెల్లవారుజామున మధు ఆబాలికను ఎత్తుకెళ్లి హైదరాబాదులో విక్రయించే ప్రయత్నం చేశాడు. తల్లి సునీత ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. తరుచూ మధు అనే వ్యక్తి సునీత వద్దకు వచ్చి మాట్లాడుతున్నట్లుగా పోలీసులు గుర్తించారు. మధుపై అనుమానం రావడంతో నిఘా పెట్టారు. అన్ని రైల్వేస్టేషన్లు, పోలీస్‌స్టేషన్‌లో, బస్టాండులలో సమాచారం ఇచ్చారు. సికింద్రాబాదు రైల్వేస్టేషన్‌లో స్థానిక పోలీసులకు అనుమానాస్పదంగా కనిపించడంతో కర్నూలు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఆవ్యక్తి మధుగానే గుర్తించిన పోలీసులు అదుపులోకి తీసుకుని ఆ బాలికను తల్లిదండ్రులకు అప్పగించారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

ఆలూరు రూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కురువళ్లి గ్రామంలో బళ్లారి రహదారిలో సోమవారం మధ్యాహ్నం కుక్కను తప్పించబోయి స్కూటర్ అదుపు తప్పిన ప్రమాదంలో హాలహర్వి గ్రామానికి చెందిన పింజారి షేక్షావలి(30) మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాలివీ.. హాలహర్వికి చెందిన షేక్షావలి ఆలూరులో పని ముగించుకుని స్కూటర్‌పై స్వగ్రామానికి బయలుదేరగా కురువళ్లి గ్రామం వద్ద అడ్డంగా వచ్చిన కుక్కను తప్పించబోయి షేక్షావలి కింద పడ్డాడు. తీవ్రంగా గాయపడిన షేక్షావలిని ఆలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. షేక్షావలికి భార్య షాబీబీ, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కార్పొరేషన్ డైరెక్టర్ల నియామకం

కర్నూలు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం పది కార్పోరేషన్లు, అభివృద్ధి బోర్డులకు డైరెక్టర్లను నియమిస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. కర్నూలు నియోజకవర్గానికి చెందిన కౌశిక్ వాయుగండ్లను ఏపీ సూక్ష్మ, చిన్న మధ్యతరహా పరిశ్రమల అభివృద్ధి బోర్డు డైరెక్టరుగా నియమించారు. ఏపీ నగర/ ఉప్పర వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్లుగా పాణ్యం



పీయూ మాదన్న

నియోజకవర్గానికి చెందిన కల్లూరు అర్బన్ గీతా నగర్‌కు చెందిన టీడీపీ క్లస్టర్-10 ఇన్‌చార్జి పీయూ మాదన్న, పత్తికొండ నియోజకవర్గానికి చెందిన వీఎల్ ప్రసాద్‌లను నియమించారు. పీయూ మాదన 1994 నుంచి టీడీపీలో కొనసాగుతున్నారు. ఇటీవలే ఈయన భార్య టీడీపీ నాయకురాలు శివమ్మ శ్రీశైలం దేవస్థానం ట్రస్టు బోర్డు డైరెక్టరుగా బాధ్యతలు చేపట్టారు. రాష్ట్రంలో పది కార్పొరేషన్లకు దాదాపుగా 122 మంది డైరెక్టర్లను నియమించినా జిల్లాకు కేవలం ముగ్గురుకి మాత్రమే అవకాశం ఇవ్వడం కొసమెరుపు. ఎమ్మిగనూరు, మంత్రాలయం, ఆలూరు, ఆదోని, కోడుమూరు నియోజకవర్గాలకు రాష్ట్ర కార్పొరేషన్ల ఛైర్మన్లు, డైరెక్టర్ల నియామకంలో ప్రతిసారి అన్యాయం జరుగుతుందని టీడీపీ శ్రేణులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

స్టేట్ క్యాన్సర్ ఇనిస్టిట్యూట్‌లో అరుదైన ఆపరేషన్

- కదిరి వాసికి ఎముకల క్యాన్సర్‌కు సర్జరీ

కర్నూలు హాస్పిటల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): స్టేట్ క్యాన్సర్ ఇనిస్టిట్యూట్‌లో ఓ మహిళకు క్లిష్టమైన ఎముకల క్యాన్సర్‌కు అరుదైన ఆపరేషన్‌ను వైద్యులు విజయవంతంగా నిర్వహించారు. అనంతపురం జిల్లా కదిరికి చెందిన 54 ఏళ్ల మహిళ ఎడమ తొడ కింద భాగంలో వాపుతో బాధపడుతూ గత నెల 15వ తేదీ హాస్పిటల్‌లో అడ్మిషన్ అయింది. డా.బ్రహ్మ మహేశ్వ రరెడ్డి, డా.శివకృష్ణ పరీక్షలు చేయగా.. కండ్రోసర్కోమా అనే ఎముకల క్యాన్సర్‌గా నిర్ధారించారు. గత నెల 27వ తేదీన క్యాన్స ర్‌పై భాగం వరకు కాలుతీసి వేయకుండా క్యాన్సర్ ఉన్న ఎముక, కండరాలను మా త్రమే తొలగించి కృత్రిమ ఎముక (మెగా ప్రొస్తెసిస్) వేసి కాలును కాపాడారు. సర్జరీ అనంతరం రోగికి జాగ్రత్తలు తెలియజేసి వాకర్ సహాయంతో నడిపించారు. ఈ నెల 10వతేదీ సాయంత్రం రోగిని డిశ్చార్జ్ చేసినట్లు స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ డా.కృష్ణ ప్రకాష్ తెలిపారు. హాస్పిటల్‌లో ఇలాంటి ఎముకల క్యాన్సర్ సర్జరీ చేయడం మొట్టమొదటిదని ఆర్థోపెడిక్, సర్జికల్ అంకాలజీ, అనస్థీషియా పెథాలజీ, డా.చైతన్య వాణి, డా.బీసన్న, డా.భారతి, డా.వరలక్ష్మీ, ఎముకల క్యాన్సర్ వైద్యులు డా.బ్రహ్మమహేశ్వరరెడ్డి డా.శివకృష్ణను అభినందించారు.

'పందికోన'లో ఆగని వేట..!

- రెచ్చిపోతున్న అక్రమార్కులు
- లక్షలాది రూపాయల ప్రభుత్వ సొమ్ము దోపిడీ
- పట్టించుకోని మత్స్యశాఖ అధికారులు
- వేలం ఎప్పుడో?



రిజర్వాయరు వద్ద చేపలను విక్రయిస్తున్న వ్యాపారులు

పందికోన రిజర్వాయర్ వద్ద సందడి వాతావరణం నెలకొంది. తాజా చేపలను కొనేందుకు జనాలు ఎగబడ్డారు. ఇక్కడ జూన్ 30వ తేదీ నాటికే చేపల వేట గడువు ముగిసింది. అయినా అక్రమార్కులు చేపల వేట కొనసాగిస్తూ ప్రభుత్వ ఖజానాకు గండికొడుతున్నారు. ఇంతలా జరుగుతున్నా మత్స్య శాఖ అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. అసలు వేలం గడువు ముగిసి 4నెలలు దాటుతున్నా వేలం నిర్వహించకపోవడానికి కారణం ఏమిటో అర్థం కావడం లేదు. అధికారులు మాత్రం ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాక వేలం నిర్వహిస్తామని చెబుతున్నారు. అప్పటి వరకు చేపల అక్రమ వేట కొనసాగుతుందా..? లేక అధికారులు ఏమైనా చర్యలు చేపడుతారా? కాలమే నిర్ణయించాలి.

పత్తికొండ, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): పందికోన రిజర్వాయరులో అక్రమార్కుల చేపల వేట కొనసాగుతూనే ఉంది. జూన్ 30తో గడువు ముగిసినప్పటికీ గతంలో వేలం పాడుకున్న వ్యక్తులు రిజర్వాయరులో నిత్యం చేపల వేట సాగిస్తూ లక్షలాది రూపాయల ప్రభుత్వ సొమ్మును కాజేస్తున్నారు. ఇంత జరుగుతున్నా మత్స్యశాఖ అధికారులు కన్నెత్తి చూడ డం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

గడువు ముగిసినా..

2025 జూన్ 30తో గడువు ముగిసినా సదరు వేలం పాటదారుడు తను ఏర్పాటుచేసుకున్న అనుచరులతో నాలుగు నెలలకు పైగా చేపల వేట సాగిస్తూ వేరే ప్రాంతాలకు రవాణా చేస్తున్నారు. పందికోన రిజర్వాయరకు సంబంధించి చేపల వేట వేలాలకు సంబంధించి నోటిఫికేషన్ విడుదల కాలేదని మత్స్యశాఖ



రిజర్వాయర్ వద్ద సిద్ధంగా ఉన్న బోట్లు

సార్ చెబితేనే చేపలు వేటాడుతున్నాం



మా కృష్ణసార్ చెబితేనే పందికోన రిజర్వాయరులో చేపలు పడుతున్నాం. చేపల వేటకు సమయం ముగిసింది అన్న విషయం మాకు తెలీదు. జీతానికి పనిచేస్తూ మా సార్ చెప్పిందే పనిగా ఇక్కడ చేపలు పడుతున్నాం. ● **చాంద్‌బాషా, సూపర్‌వైజర్**

అక్రమార్కులపై చర్యలు చేపడతాం..

పందికోన రిజర్వాయరులో చేపల వేట సాగిస్తున్న వారిపై చర్యలు చేపడతాం. ని బంధనలకు విరుద్ధంగా ఎవరైనా నడుచుకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. **- రంగనాథ్‌బాబు, మత్స్యశాఖ జిల్లా అధికారి, కర్నూలు**

అధికారులు చెబుతున్నారు. జిల్లావ్యాప్తంగా ఉన్న రిజర్వాయర్లు, చెరువులకు ఒకేసారి నోటిఫికేషన్ ప్రభుత్వం విడుదల చేస్తుందని అప్పటివరకు వేలం వేయలేమంటున్నారు. ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా కొనసాగుతున్న చేపలవేటపై వారు ఎందుకు చర్యలు చేపట్టడం లేదన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రాజకీయ నాయకుల బెదిరింపుల కారణంగా చర్యలు చేపట్టం లేదా? మరేమైనా కారణాలు ఉన్నాయా? అన్నది ప్రశ్నార్థకంగా మిగిలింది.

బెస్త సంఘాలకు..

రిజర్వాయరులో గాని చెరువుల్లోగాని చేపల పెంపకను స్థానికంగా బెస్త సంఘాలకు కేటాయించాల్సి ఉంటుంది. పందికోన రిజర్వాయరు సమీప గ్రామాలైనా పందికోన, కొత్తపల్లి గ్రామాల్లో బెస్త సంఘాలు లేకపోయినా రిజర్వాయరుకు 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న పత్తికొండలో రిజిష్టర్ బెస్త సంఘాలు అందుబాటులో ఉన్నాయి. గత ఏడాది వేలం పాటల్లో పాల్గొనేందుకు మత్సశాఖ అధికారులను కలిసినప్పటికీ తమ వర్గానికి వారు చేపల వేట కేటాయించేందుకు అంగీకరించలేదని బెస్త సంఘాలు చెబుతున్నాయి.

తిరునాళ్లను తలపించిన..

పందికోన రిజర్వాయరు వద్ద ఆదివారం చేపలు కొనేందుకు వచ్చిన వారితో తిరునాళ్ల తలపించింది. అక్రమార్కులు పట్టిన చేపలను కిలో రూ.100, 150 చొప్పున విక్రయాలు చేశారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన చేపల కంటే అప్పటికప్పుడు పట్టిన చేపలు రుచిగా ఉంటాయని కొనేందుకు వచ్చిన ప్రజలు 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

రైతులకు అండగా ఉంటాం

- త్వరలోనే మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు
- వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు
- మంత్రిని కలిసిన కలెక్టర్, జేసీ, ప్రజాప్రతినిధులు



మంత్రికి బొకే అందిస్తున్న కలెక్టర్, నాగేశ్వరరావు యాదవ్

కర్నూలు అగ్రికల్చర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): రైతులకు అండగా నిలుస్తున్నామని వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. సోమవారం రాత్రి మంత్రి అచ్చెన్నాయుడు మంగళవారం ముఖ్యమంత్రి వర్చువల్‌గా ప్రారంభించనున్న వివిధ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు మంత్రి కర్నూలుకు వచ్చారు. నగరంలోని మౌర్యఇన్‌లో ఆయన బస చేశారు. కలెక్టర్ సిరి, జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్‌తో పాటు వ్యవసాయ అనుబంధ విభాగాల జిల్లా అధికారులు మంత్రిని కలిశారు. జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, ఎంపీలు ఇతర ప్రజాప్రతినిధులు తెలుగుదేశం పార్టీ నాయకులు మంత్రిని కలిసి జిల్లా పరిస్థితులను వివరించారు. ఉమ్మడి జిల్లాలో పంటల సాగు, పంట ఉత్పత్తులపై రైతులకు అందుతున్న మద్దతు ధరలపై సంబంధిత అధికారులను మంత్రి అడిగి తెలుసుకున్నారు. మొంథా తుఫాన్ ప్రభావం పెద్దగా లేదని పంట నష్టం ఎక్కువగా జరగలేదని వ్యవసాయశాఖ జేడీ వరలక్ష్మి తెలిపారు. రైతులు పండించిన పత్తి పంటకు సంబందించి మద్దతు ధర కోసం రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారనీ మార్కెటింగ్ శాఖ ఏడీఎం నారాయన మూర్తి మంత్రి దృష్టికి తెచ్చారు. ఏయే పంట ఉత్పత్తులకు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర అందడం లేదో అడిగి తెలుసుకున్నారు. త్వరలోనే మొక్కజొన్న కొనుగోళ్లను ప్రారంభిస్తున్నట్లు మంత్రి ప్రకటించారు. పత్తికి మద్దతు ధరను అందించడంలో తేమ శాతం ఎక్కువగా ఉండటం వల్ల సీసీఐ అధికారులు కొనుగోలు జరపడం లేదని డీసీఎంఎస్ ఛైర్మన్ వై.నాగేశ్వరరావు యాదవ్, ఎంపీ బస్తిపాటి నాగరాజు, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితలు మంత్రి దృష్టికి తెచ్చారు. ఈ సమస్యపై సీసీఐ కేంద్ర అధికారులకు రాష్ట్ర ప్రభుత్వం తరుపున లేఖను పంపుతామని, కేవలం 12శాతం ఉంటేనే మద్దతుధరను అందించాలన్న నిబంధనను సడలించాలని కోరామన్నారు. ప్రభుత్వ విజ్ఞప్తికి సీసీఐ అధికారులు సానుకూలంగా స్పందిస్తారని ఆశిస్తున్నట్లు మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు.

మంత్రి అచ్చెన్నాయుడిని కలిసిన గౌరు చరిత

కల్లూరు: వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడిని పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరితారెడ్డి కలిశారు. సోమవారం జిల్లాకు వచ్చిన మంత్రిని ఎమ్మెల్యే మౌర్యాఇన్ హోటల్‌లో బొకేతో స్వాగతం పలికారు. ఇటీవల తుఫాను ప్రభావంతో పంటలు దెబ్బతిన్నాయని, మొక్కజొన్న పంటలకు మద్దతు ధర కల్పించాలని ఆదుకోవాలని మంత్రిని కోరారు.



అధికారులకు ఫిర్యాదు చేస్తున్న నాయకులు

అర్జీలను పరిష్కరించాలి

కర్నూలు కలెక్టరేట్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): పీజీఆర్ఎస్‌లో వచ్చిన అర్జీలను నిర్దీత గడువులోపు పరిష్కరించాలని కలెక్టర్ డా.ఏ. సిరి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతులను స్వీకరించారు. అనంతరం కలెక్టర్ ఫిర్యాదుల పరిష్కారంపై అధికారులతో సమీక్షించారు. పబ్లిక్ హెల్త్‌లో రీ ఓపెన్ శాతం 50 శాతం ఉందన్నారు. సీఎంవో గ్రీవెన్స్‌లకు సంబంధించి ఆదోని సబ్ కలెక్టర్ వద్ద 5, కర్నూలు ఆర్డీవో వద్ద 9, పత్తికొండ ఆర్డీవో వద్ద 7, సర్వే ఏడీ వద్ద 3, కలెక్టరేట్ ఏవో వద్ద 2, డిస్ట్రిక్ట్ రిజిస్ట్రార్ వద్ద 2, సివిల్ సప్లయిస్ వద్ద 2, పంచాయతీరాజ్, డీఆర్‌డీఏ పీడీ, ఏపీఐఐసీ జెడ్ఎంల వద్ద ఒక్కొక్క దరఖాస్తు చొప్పున పెండింగ్ ఉన్నాయని, బియాండ్ ఎస్ఎల్ఏలో వెళ్లకుండా పరిష్కరించాలని ఆదేశించారు. జేసీ నూరుల్ కమర్, డీఆర్వో వెంకట నారాయణమ్మ, హౌసింగ్ పీడీ చిరంజీవి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కొండయ్య ఉన్నారు.

పార్క్ భూముల కబ్జాకు యత్నం...!

నగరంలోని నిర్మల్‌నగర్, గురు రాఘవేంద్ర నగర్, గీతానగర్ పరిధిలో పార్కు భూమిని కొందరు వ్యక్తులు కబ్జా చేసేందుకు యత్నిస్తున్నారని రాయలసీమ ఉద్యమ యువనాయకులు సీమకృష్ణ రాథోడ్, రవికుమార్, మాదాసి కురువ సుంకన్న కలెక్టర్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. కల్లూరు గ్రామ పంచాయతీ పరిధిలో ఎల్‌పీ-121/1981 పేరుతో ఆమోదించిన లేఅవుట్‌లో మొత్తం 19.66 ఎకరాలు ఉండగా.. అందులో 1.01 ఎకరాలను పార్కు/ ఓపెన్ స్పేస్ కోసం కేటాయించారు. 301/బి, 302, 302/2, 304/1, 305/2, 284/5, 286/1, 287/1 సర్వే నెంబర్లలో ఈ లేఅవుట్ ఉందన్నారు. కబ్జాదారులు బోగస్ డాక్యుమెంట్లు రూపొందించి ఆ భూమిని స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారని విచారణ చేపట్టాలని కోరారు.

చిన్నారులకు అస్వస్థత



చికిత్స పొందుతున్న చిన్నారులు

ఆదోని రూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగులాపురంలో రెండు అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. అంగన్‌వాడీ కేంద్రం-2లో 5 సంవత్సరాల్లోపు పిల్లలు 31 మంది ఉన్నారు. సోమవారం 26 మంది హాజరయ్యారు. ఉదయం 10 గంటలకు అంగన్‌వాడీ సిబ్బంది పుష్ప పిల్లలందరికీ అంగన్‌వాడీ పాలు అందించారు. మధ్యాహ్నం 12;30గంటలకు అన్నంతోపాటు దోసకాయ పప్పును పిల్లలకు పెట్టింది. మధ్యాహ్నం 2;30 గంటలకు 8 మంది మగ పిల్లలు, ఇద్దరు ఆడ పిల్లలు ఏడవడం ప్రారంభించారు. అమ్మా కడుపునొప్పి అంటూ ఏకధాటిగా వాంతులు చేసుకోవడంతో పాటు అక్కడే కుప్పకూలి పోయారు. విషయం గ్రహించిన పుష్ప హెల్త్ అసిస్టెంట్ వద్ద మందులు తెచ్చి వేసింది. ఆపది మంది చిన్నారులు వాంతులు చేసుకుంటూ కడుపునొప్పితో ఏడుస్తుండడంతో వారి ఇళ్లకు వదిలి చేయి దులుపేసుకున్నారు. ఆ పిల్లలు ఇంటికి వెళ్లినప్పటికీ పిల్లలు వాంతులు చేసుకుంటూ కడుపునొప్పితో ఏడుస్తుండడంతో తల్లిదండ్రులు స్థానిక ఆర్ఎంపీ దగ్గరకు తీసుకెళ్లారు. సీడీపీవో డిల్లీశ్వరి గ్రామానికి చేరుకుని స్థానికంగా ఉండే హెల్త్ సిబ్బందితో వైద్య పరీక్షలు చేయించారు. విషయం తెలుసుకున్న సబ్‌కలెక్టర్ అజయ్‌కుమార్ రాత్రి 8 గంటల సమయంలో గ్రామానికి చేరుకుని పిల్లల ఆరోగ్యం గురించి ఆరాతీశారు. వీరిలో మూడేళ్ల వైశాలి, నాలుగేళ్ల వయస్సు గల సుదర్శన్‌ల పరిస్థితి విషమంగా ఉండడంతో రాత్రి 10 గంటలకు ఆదోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తాలుకా సీఐ నల్లప్ప, ఎస్ఐ రామాంజనేయులు ఆసుపత్రికి చేరుకుని పిల్లల ఆరోగ్యంపై ఆరాతీశారు. అపరిశుభ్రమైన పాత్రల్లో, కుళ్లిపోయిన కూరగాయలతో వంటలు చేయడంతో పిల్లలకు వడ్డించడంతోనే ఇలా జరిగిందని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.

న్యాయం చేస్తాం

- పోలీసు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 99 సమస్యలు: ఎస్పీ విక్రాంత్ పాటిల్



బాధితుల సమస్య వింటున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

కర్నూలు క్రైం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి సమస్యలు త్వరితగతిన పరిష్కరించి బాధితులకు న్యాయం చేస్తామని ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. సోమవారం కొత్తపేటలోని టూటౌన్ పోలీస్‌స్టేషన్ సమీపంలో ఎస్పీ క్యాంపు కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను స్వీకరించారు. మొత్తం 99 ఫిర్యాదులు వచ్చాయి.

● కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి సీ.క్యాంపు చెందిన రాఘవరెడ్డి రూ.1లక్ష తీసుకుని మోసం చేశాడని తాడిపత్రికి చెందిన నరసింహులు ఫిర్యాదు చేశారు.

● నవీన్‌కుమార్ అనే వ్యక్తి వీసా ఇప్పిస్తామని చెప్పి రూ.30వేలు తీసుకుని మోసం చేశాడని లక్ష్మీనగర్‌కు చెందిన సాదిక్ ఫిర్యాదు చేశారు.

● శంకర్ అనే వ్యక్తి కర్నూలు పాతబస్టాండు దగ్గర దీపక్ లక్కీగోల్డ్ స్కీం పేరుతో డబ్బు కట్టించుకొని మోసం చేసి వెళ్లిపోయాడని కర్నూలు సీ.క్యాంపు చెందిన లక్ష్మి ఫిర్యాదు చేశారు.

● మూడో కుమార్తె ధనలక్ష్మి తన ఇంటిని ఆక్రమించుకోవాలని బయటకు పంపించిందని, కర్నూలు చెందిన నరసమ్మ ఫిర్యాదు చేశారు.

నరకదారి



మండలంలోని తిప్పాయపల్లె గ్రామంలో సీసీ రోడ్డు లేకపోవడంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. కిలో మీటరు వరకు గుంతలు ఉండటంతో అవస్థలు పడుతున్నారు. చిన్న వర్షం కురిసినా నీరు నిలుస్తోంది. ఈ దారిలోనే బ్రాహ్మణపల్లె, శకునాల, గడివేముల మండలాలకు వాహనాలు వెళ్తుంటాయి. ప్రజాప్రతినిధులు అధికారులు స్పందించి సీసీ రహదారి నిర్మించి ఇబ్బందులు తీర్చాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు. - ఓర్వకల్లు

ప్రమాదం



ఆటోలలో ప్రయాణికులను పరిమితికి మంచి ఎక్కించుకుంటే ఆటోను సీజ్ చేస్తానని ఎస్ఐ వేణుగోపాల్‌రాజు హెచ్చరించారు. సోమవారం మండలకేంద్రంలో వాహనలను తనిఖీ చేశారు. కూలీలతో మాట్లాడుతూ ఒకే ఆటోలో 25 మందికిపైగా వెళితే ఆటో అదుపు తప్పితే ప్రాణాలు గాలిలో కలుస్తాయని కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం ఆటో యజమానులకు జరిమాన విధించారు. ఎస్ఐ వెంట హెడ్ కానిస్టెబుల్ తిమ్మప్ప, ఆచారి, శ్రీరాములు, శ్రీనివాసలు, గౌడ్ ఉన్నారు. -సి.బెళగల్

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కల్లూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మరమ్మతు పనుల్లో భాగంగా నగరంలోని బి.క్యాంప్ సెక్షన్‌లో మంగళవారం ఉదయం 7 నుంచి 9 గంటలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని కర్నూలు డివిజన్ ఈఈ టి.శేషాద్రి సోమవారం ప్రకటనలో తెలిపారు. బి.క్యాంపు, అరోరానగర్, సి.క్యాంపు సెంటర్ పరిధిలో సరఫరాలో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

ఒకేషనల్ కాలేజీ ప్రిన్సిపాల్‌కు పురస్కారం



పురస్కారం పొందిన ప్రిన్సిపాల్ నాగస్వామి నాయక్

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): బి.క్యాంపు ప్రభుత్వ ఒకేషనల్ కళాశాల ప్రిన్సిపాల్ డా.నాగస్వామి నాయక్‌కు మక్ష్ గ్లోబల్ ఫౌండేషన్ సౌత్ ఇండియా అవార్డ్ - క్రాంతి పురస్కార్-2025ను ప్రదానం చేశారు. హైదరాబాద్ నాంపల్లి పొట్టి శ్రీరాములు విశ్వ విద్యాలయ ఆడిటోరియంలో ఎమ్మెల్సీ మధుసూదనాచారి, తెలంగాణ గ్రంథాలయ ఛైర్మన్ రియాజ్, తెలంగాణ ఐసీసీ ఛైర్మన్ నల్లబాలు చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు.

పారిశుధ్య కార్మికులకు కొత్త యూనిఫాం



యూనిఫాం అందిస్తున్న ఏజెన్సీ నిర్వాహకులు

కర్నూలు హాస్పిటల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సర్వజన వైద్యశాల, కర్నూలు మెడికల్ కాలేజీ, ప్రాంతీయ కంటి ఆసుపత్రిలో పని చేసే పారిశుధ్య కార్మికులకు సోమవారం నూతన యూనిఫాం అందజేశారు. పద్మావతి హాస్పిటాలజీ అండ్ ఫెర్టిలిటీ మేనేజ్‌మెంట్ సర్వీసెస్ మేనేజర్ ఎం.బాలాజీ, హెల్త్ ఇన్‌స్పెక్టర్ టి.గోవిందుస్వామితో కలిసి పంపిణీ చేశారు. మొత్తం 570 మంది కార్మికులు, సూపర్‌వైజర్లకు యూనిఫామ్ అందజేశామన్నారు.

సీపీ బ్రౌన్ సేవలు చిరస్మరణీయం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ ఇందిరా శాంతి

కర్నూలు అర్బన్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): తెలుగుభాష, సాహిత్యానికి సీపీ బ్రౌన్ చేసిన సేవలు చిరసర్మరణీయమని ప్రిన్సిపాల్ ఇందిరాశాంతి అన్నారు. సోమవారం నగరంలోని ప్రభుత్వ బాలుర డిగ్రీ కళాశాలలో తెలుగు అధ్యయన శాఖ ఆధ్వర్యంలో చార్లెస్ ఫిలిప్ బ్రౌన్ జయంతి నిర్వహించారు. తెలుగు అధ్యయన విభాగాధిపతి ప్రొఫెసర్ డావింధ్యావాసినీ దేవీ మాట్లాడుతూ సీపీ బ్రౌన్ చేసిన నిరుపమాన సాహిత్య సేవలను స్మరించుకోవడం, నివాళి అర్పించడం మనందరి బాధ్యత అన్నారు. వైస్ ప్రిన్సిపాల్ జె.హేమంత్, అధ్యాపకులు కామల్లీ నాయక్, నాగర్న, శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

అకౌంటింగ్ ప్రాముఖ్యమైనది

ప్రతి వ్యక్తి జీవితంలో అకౌంటింగ్ ప్రాముఖ్యమైనదని ప్రిన్సిపాల్ అన్నారు. కళాశాలలో ఇంటర్నెషనల్ అకౌంటింగ్ డే సందర్భంగా ఫాదర్ ఆఫ్ అకౌంటింగ్ లూక్ పాసీయోలి చిత్ర పటానికి నివాళి అర్పించారు. వైస్ ప్రిన్సిపల్, అధ్యాపకులు జె.మస్తాపి, రమణరెడ్డి, మెహన్ మురళి, మాదన్న పాల్గొన్నారు.

సామాజిక సేవలో రాష్ట్రస్థాయి అవార్డు



నరసింహులును అభినందిస్తున్న ప్రతినిధులు

కర్నూలు అగ్రికల్చర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): నగరానికి చెందిన యు నరసింహులు కు రాష్ట్రస్థాయి అవార్డు దక్కింది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో నాబార్డు అమలు చేస్తున్న సేవా కార్యక్రమాల్లో రైతులకు, గ్రావల ప్రజలకు సేవలందించి నందుకు సోమవారం హైదరాబాద్‌లోని హోటల్ హరితలో జరిగిన ఓ కార్యక్రమంలో అవార్డులను ప్రదానంచేశారు. ఏపీ నుంచి నవయూత్ అసోసియేషన్ సీఈవో నరసింహులు, విశ్రాంత ఐఏఎస్ అధికారి అజయ్, ఐఏఎస్ అధికారి వజ్రా వెంకటేశ్వర్లు, గాయని కౌసల్య చేతుల మీదుగా బెస్ట్ సోషల్ సర్వీసు అవార్డును అందుకోవడం నాబార్డు సంస్థకు గుర్తింపు తెచ్చినట్లయిందని డీజీఎం సుబ్బారెడి నరసింహులును అభినందించారు.

గడువులోగా పరిష్కరించాలి

● కమిషనర్ విశ్వనాథ్



అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్ విశ్వనాథ్

కర్నూలు న్యూసిటీ, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రజా పరిష్కార వేదికకు వచ్చే అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని నగర పాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్ ఆదేశించారు. సోమవారం నగర పాలక సమావేశ భవనంలో వినతులు స్వీకరించారు. రీ ఓపెన్ కేసులు ఉండకూడదని, వినతులను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కారమేల్యాలా చర్యలు తీసుకోవాలన్నారు. అడిషనల్ కమిషనర్ ఆర్‌జీవి.కృష్ణ, డిప్యూటీ కమిషనర్ సతీష్‌కుమార్ రెడ్డి, మేనేజర్ చిన్నరాముడు, ఎంఈ మనోహర్‌రెడ్డి, డీసీపీ వెంకటరమణ, ఆర్‌ఓ జునైద్, ప్రజారోగ్య అధికారి నాగశివప్రసాద్, శానిటరీ సూపర్‌వైజర్ నాగరాజు, టిడ్కో అధికారి పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

● నగరంలోని 20 కాలనీల ప్రజలకు ఉపయోగపడే ప్రధాన రోడ్డును నిర్మించాలని పట్టణ పౌర సంక్షేమ సంఘం సభ్యుడు ఇ.పుల్లారెడ్డి కమిషనర్‌ను వినతి పత్రం అందజేశారు. విష్ణుటౌన్‌షిప్ నుంచి వెంకటరమణ కాలనీ, రైల్వేస్టేషన్ మీదుగా నగరంలోకి రావడానికి దగ్గర అవుతుందని 60 అడుగుల రోడ్డును నిర్మించాలని కోరారు. కాలనీవాసులు చంద్రశేఖర్, యూసుఫ్, నాగరాజు, సీవి.వర్మ, ఈ.లక్ష్మణగౌడ్ ఉన్నారు.

● 27, 30 వార్డులలో సమస్యలను పరిష్కరించాలని సీపీఎం నగర కార్యదర్శివర్గసభ్యులు సుధాకరప్ప వినతి పత్రం అందజేశారు. 27వ వార్డు క్రిష్ణానగర్ మెయిన్ రోడ్డు రైల్వే అండర్ బ్రిడ్జి నుంచి నేషనల్ హైవే ఫ్లైఓవర్ బ్రిడ్జి వరకు సీసీ రోడ్డు నిర్మించాలని, 30వ వార్డు షరీన్ నగర్ అంబేద్కర్ పూలే విగ్రహం నుంచి హంద్రీ నది వరకు పెద్ద కాలువల నిర్మిస్తున్నారని...అయితే కరెంటు పోల్స్‌ను తొలగించడం లేదని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో నాయకులు జి.ఏసు, ఎం.లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

పూల రైతులకు న్యాయం చేయాలి

కర్నూలు కల్చరల్: పూలు పండించే రైతులకు న్యాయం చేయాలని వీహెచ్‌పీ, భజరంగ్ దళ్ నాయకులు కోరారు. సోమవారం నగరపాలక సంస్థ కమిషనర్ విశ్వనాథ్‌కు వినతి పత్రం సమర్పించారు. నాయకులు తూముకుంట ప్రతాపరెడ్డి, గోవిందరాజులు, రాంబాబు, బజరంగ్ దళ్ నాయకులు సాయినాథ్, హరికృష్ణ, అర్జున్, గుజరాతి సురేష్ కమిషనర్‌తో మాట్లాడుతూ పూలమార్కెట్‌లో దళారీల ఆధిపత్యంతో రైతులకు న్యాయం జరగడం లేదన్నారు. స్పందించిన కమిషనర్ చర్యలు తీసుకుంటామని వారికి హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు.

అభివృద్ధికి పెద్దపీట



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి

కల్లూరు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): అర్బన్ వార్డుల్లో అభివద్ధి పనులకు టీడీపీ ప్రభుత్వం పెద్దపీట వేసిందని పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరితారెడ్డి అన్నారు. సోమవారం 32వ వార్డు శర్మనగర్‌లో రూ. 8లక్షలు, 29వ వార్డు వీవీఎస్ ఫంక్షన్ హాల్ వద్ద రూ.1,52 లక్షలతో డ్రైనేజీ, త్రాగునీటి పైప్‌లైన్ నిర్మాణ పనులను ప్రారంభించారు. 16 వార్డుల్లో ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామన్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించి మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో 32వ వార్డు కార్పోరేటర్ సానా శ్రీనివాసులు, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ కెఎస్.శ్రీనివా సులు, టీడీపీ నాయకులు టైలర్ నాగరాజు, రవిప్రకాష్‌రెడ్డి, ఎన్వీ.రామకృష్ణ, శైలజా యాదవ్, వీరంద్ర, ఫిరోజ్, పుల్లయ్యగౌడ్, రామకృష్ణ పాల్గొన్నారు.

సత్తా చాటిన కర్నూలు రెవెన్యూ జట్టు



మూడోస్థానంలో నిలిచిన కర్నూలు రెవెన్యూ జట్టు

కర్నూలు కలెక్టరేట్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లాలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి రెవెన్యూ క్రీడల్లో జిల్లా మహిళా ఉద్యోగులు సత్తా చాటి, మూడో స్థానాన్ని కైవసం చేసుకున్నారు. తమకు క్రీడల్లో పాల్గొనే అవకాశం కల్పించిన కలెక్టర్, జేసీకు ఏపీఆర్ఎస్ఏ జిల్లా అధ్యక్షులు నాగరాజు, లక్ష్మిరాజు ధన్యవాదాలు తెలిపారు.



క్రీడాకారులతో కలెక్టర్ సిరి

క్రీడాకారులకు కలెక్టర్ అభినందన

కర్నూలు స్పోర్ట్స్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ తైక్వాండో పోటీలలో పతకాలు సాధించిన క్రీడాకారులను కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి సోమవారం అభినందించారు. ఇటీవల రాష్ట్ర స్థాయి కడప జిల్లా రైల్వేకోడూరులో నిర్వహించిన బాలికల విభాగం అండర్-19లో డి.సుగంధిని వెండి పతకాన్ని యు.ఇంద్రాణి కాంస్య పతకం సాధించారు. ఏలూరులో నిర్వహించిన అండర్-17 విభాగంలో బి.లేఖ్య శ్రీ చందన వెండి పతకం ఎంఆర్ నక్షత్ర కాంస్యం పతకాలు సాదించారు. అలాగే బాలుర విభాగంలో డి.రేవంత్ కాంస్యం సాదించారు. డీఈవో శామ్యూల్ పాల్, నారాయణ పాఠశాల ప్రిన్సిపాల్ ఎంఎస్ శ్రీనివాసరెడ్డి, డీఎస్‌డీవో భూపతిరావు, కే.రాఘవేంద్ర, టి.కృష్ణ పాల్గొన్నారు.

రైఫిల్ షూటింగ్‌లో జిల్లాకు పతకాలు

ఈ నెల 7 నుంచి 9వ తేదీ వరకు ప్ర ఒంగోలులో నిర్వహించిన 69వ రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-19, 14 రైఫిల్ షూటింగ్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు జిల్లా షూటర్స్ పతకాలు పంట పండించారు. సోమవారం జిల్లాకు విచ్చేసిన విజేతలను డీఈవో శామ్యూల్ పాల్ అభినందించారు. కోచ్ రవికుమార్, జిల్లా కార్యదర్శి ఎంఎండీ బాషా ఉన్నారు.



మాట్లాడుతున్న చిన్న పిల్లల వైద్యులు

టీకాలతో చిన్నారులకు రక్షణ

కర్నూలు హాస్పిటల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): టీకాలు వేయిస్తే చిన్నారులను ప్రాణాంతక వ్యాధుల నుంచి రక్షించవచ్చని మెడికవర్ హాస్పిటల్ పీడీయాట్రిషన్ అండ్ నియోనటాలజిస్టు డా.కే.సింధూర రెడ్డి అన్నారు. వరల్డ్ ఇమ్యూనైజేషన్ డే సందర్భంగా హాస్పిటల్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. పీడియాట్రిక్ ఇంటెన్సిలిస్టు డా.వై.గణేష్, వైద్యులు డా.కె.అనూష, డా.కె.మమత మాట్లాడుతూ పిల్లలకు టీకాలు వేయిస్తే పోలియో డిఫ్తీరియా, మిజిల్స్, టెటనస్, వ్యాధులను పూర్తిగా నివారించవచ్చన్నారు. అనంతరం హాస్పిటల్‌లో టీకాలు వేయించుకున్న పిల్లలు వారి తల్లిదండ్రులతో క్లస్టర్ హెడ్ వై.మహేశ్వరరెడ్డి మాట్లాడారు.

ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలి



సదస్సును ప్రారంభిస్తున్న వైద్యులు

కర్నూలు హాస్పిటల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మధుమేహ బాధితులు ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలని కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డా.కే.చిట్టినరసమ్మ అన్నారు. వరల్డ్ డయాబెటిస్ డే పురస్కరించుకుని న్యూలెక్చరర్ గ్యాలరీలో వైద్య విజ్ఞాన సదస్సు సోమవారం నిర్వహించారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.కే.వెంకటేశ్వర్లు, ఎండోక్రైనాలజీ హెచ్‌వోడీ డా.పి.శ్రీనివాసులు, నిమ్స్ హాస్పిటల్ ఎండోక్రైనాలజీ హెచ్‌వోడీ డా.బీట్రైస్‌యానితో కలిసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రొఫెసర్ డా.బీట్రైస్‌అనే మాట్లాడుతూ డయాబెటిస్ బాధితులకు ఆస్టియోబ్లాస్ట్ కణాలు సరిగ్గా పనిచేయవని, దాని ద్వారా ఎముకలు బలహీన పడుతుందన్నారు. విశ్రాంత సూపరింటెండెంట్ డా.తిరుమలాచారి, ఎండోక్రైనాలజీ విభాగపు అసోసియేట్ ప్రొ.డా.పి.రాధారాణి, అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.సయ్యద్ ఆలీమ్ పాల్గొన్నారు.

● కేఎంసీ అనాటమీ విభాగంలో ఎంబీబీఎస్ విద్యార్థులచే ప్రిన్సిపాల్ డా.కే.చిట్టినరసమ్మ కేడావర్ ఓత్ ఽ నిర్వహించారు. మరణించిన మృతదేహాలను వైద్యవిద్యార్థులు గౌరవించాలని, శరీరంలోని ప్రతి అవయవం ఎలా ఉంటుందో తెలుసుకోవచ్చన్నారు. చనిపోయిన శరీర అవయవాలను పరిశోధన చేయడం అన్నది వైద్య విద్యలో పునాదిలాంటిదని ప్రతి విద్యార్థి కేడావర్‌ను గౌరవించాలన్నారు. హెచ్‌వోడీ డా.శోభాదేవి, ప్రొ.డా.వాణిశ్రీ, వైద్యులు పాల్గొన్నారు.

కుక్కల నియంత్రణకు సుప్రీంకోర్టు ఆదేశాలు అమలు చేయాలి

కర్నూలు న్యూసిటీ, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): కుక్కల నియంత్రణకు ఇటీవల సుప్రీ కోర్టు జారీ చేసిన ఆదేశాలను అమలు చేయాలని కమిషనర్ పి.విశ్వనాథ్ పేర్కొన్నారు. సోమవారం శానిటరీ ఇన్‌స్పెక్టర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆసుపత్రులు, పాఠశాల, కళాశాలలు, బస్టాండ్ల వద్ద కుక్కలను నియంత్రించాలని సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చచేసిందన్నారు. వెంటనే కుక్కలను పట్టుకెళ్లి షెడ్లలో ఉంచి, వసతులు కల్పించాలని ఇంజీనింగ్ అధికారులను ఆదేశించారు. హెల్త్ ఆఫీసర్ డా.నాగశివప్రసాద్, శానిటరీ సూపర్‌వైజర్ నాగరాజు, శానిటరీ ఇన్స్‌పెక్టర్లు మునిస్వామి, ముర్తుజా, రాజు, శ్రీనివాసులు ఉన్నారు.

పత్తి ఓబులయ్యకు వాకర్స్ సన్మానం



పత్తి ఓబులయ్యను సన్మానిస్తున్న వాకర్స్

కర్నూలు కల్చరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ జీవితకాల పురస్కారం గ్రహీత, టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్యను నగరంలోని వాకర్స్ అసోసియేషన్ సభ్యులు సన్మానించారు. కార్యదర్శి కేవీ రమణ మాట్లాడుతూ నాలుగు దశాబ్దాలకు పైగా నాటక రంగానికి సేవలు చేస్తూ జిలాకు రాష్ట్రస్థాయిలో ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చారని అన్నారు. సీవీ రెడ్డి మాట్లాడుతూ నాటక పోటీల్లో 38 నందులు సాధించారన్నారు. జూటూరు సత్యం, కె. శివయ్య, బీఎస్ఎన్ఎల్ రమణ, చిన్నరాముడు, వేణు, నాగ అరుణ్, రాజశేఖర్ అభినందించారు.

వాల్మీకులకు ఇచ్చిన హామీ నెరవేర్చాలి



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న వాల్మీకులు

కర్నూలు కలెక్టరేట్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన హామీ ప్రకారం ఎస్టీ రిజర్వేషన్ పునరుద్ధరించాలని ఏపీవీ బీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు క్రాంతి నాయుడు డిమాండ్ చేశారు. సోమవారం నగరంలోని వాల్మీకి సర్కిల్‌లో దృఢ సంకల్ప దీక్ష చేసి, కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. త్వరలో లక్ష మందితో సభ, కర్ణాటక బార్డర్ నుంచి కలెక్టరేట్ వరకు పాదయాత్రలు నిర్వహిస్తామని తెలియజేశారు. అర్జున్, రామకృష్ణ, రామానాయుడు, బేతంకృష్ణ, తలారి కృష్ణ, శేఖర్ పాల్గొన్నారు.

అనధికార నిర్మాణాల కూల్చివేతకు చర్యలు

గూడూరు నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీ పరిధిలో అనధికార నిర్మాణాల కూల్చివేతకు చర్యలు తీసుకోంటున్నట్లు ఇన్‌చార్జ్ కమిషనర్ విజయలక్ష్మి తెలిపారు. సోమవారం మాట్లాడుతూ మున్సిపల్ మంత్రిఆదేశాలు, పట్టణ అభివృద్ధి ప్రణాళిక శాఖ సూచనల మేరకు నగర పంచాయతీ పరిధిలో అనధికార నిర్మాణాలు, డివియేషన్లపై కఠిన చర్యలు తీసుకోంటున్నామన్నారు. ప్రజలు, గృహ యజమానులు, వ్యాపారవేత్తలు నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేయరాదని హెచ్చరించారు.

ప్రైవేటు ఆసుపత్రులపై చర్యలు తీసుకోవాలి

కర్నూలు కలెక్టరేట్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ వైద్యసేవలు ఉచితంగా అందించకుండా డబ్బు వసూలు చేస్తున్న ప్రైవేటు ఆసుపత్రులపై చర్యలు తీసుకోవాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ సభ్యుడు కే.భాస్కర్ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టర్ డాసిరికి వినతిపత్రం ఇచ్చారు. పేద రోగుల నుంచి వసూలు చేస్తున్నా వైద ఆరోగ్యశాఖా ధికారులు చర్యలు తీసుకోవడం లేదన్నారు.

సత్వరమే పరిష్కరించండి


ఓర్వకల్లు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి వచ్చిన అర్జీలను, వినతులను తక్షణమే పరిష్కరించాలని తహసీల్దార్ విద్యాసాగర్, ఎంపీడీవో అనసూయ అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతులు స్వీకరించారు. సంబంధిత అధికారులు పరిశీలించాలని, ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. పీఆర్ ఇంజనీర్ సురేంద్రనాథ్ రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీర్ శ్రీనివాసులు, ఎంఈవో ఓంకార్ యాదవ్, అధికారులు పాల్గొన్నారు.

ఇంటి స్థలం ఇవ్వాలి

కర్నూలు న్యూసిటీ, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): అర్హులైన పేదలకు రెండు సెంట్ల చొప్పున ఇళ్లస్థలం ఇవ్వాలని సీపీఎం న్యూసిటీ కార్యదర్శి టి.రాముడు కోరారు. సోమవారం శ్రీరామ్‌నగర్ 58,59 సచివాలయాల వద్ద ధర్నా నిర్వహించారు. డబ్బు కట్టిన లబ్ధిదారులకు టిడ్కో ఇళ్లను అప్పగించాలన్నారు. ఎస్.అజ్మత్, ఆర్.నరసింహులు పాల్గొన్నారు.

కార్తీక సోమవారం పూజలు

కర్నూలు కల్చరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం మూడో సోమవారం సందర్భంగా మహిళలు పూజలు నిర్వహించారు. సంకల్‌బాగ్ హరిహర క్షేత్రంలో ఉదయం అభిషేకాలు, ప్రత్యేక అలంకరణ చేశారు. దేవాలయ అధ్యక్షుడు సండేల్ చంద్రశేఖర్ కార్తీక దీపోత్సవ వివరాలను భక్తులకు తెలియజేశారు. నెహ్రూనగర్‌లో సత్యసాయి మందిరంలోని శివాలయంలో సామూహిక దీపోత్సవాల్లో పాల్గొన్నారు. పాతనగరం లలితా పీఠంలో శ్రీచక్ర యంత్రం ఆకారంలో ముగ్గులు వేసి, దీపోత్సవాన్ని నిర్వహించారు. పీఠాధిపతి గురు మేడా సుబ్రహ్మణ్య స్వామి దీపోత్సవాలు ప్రారంభించారు. కేసీ కెనాల్ సమీపంలోగల శ్రీరమా సమేత సత్యనారాయణ స్వామి ఆలయ ఆవరణలో మహిళలు దీపాలు వెలిగించి ఉసిరిక చెట్టు వద్ద పూజలు చేశారు.



పూజలు చేస్తున్న మహిళ



నెహ్రూనగర్‌లో దీపాలు వెలిగిస్తున్న భక్తులు





ఓర్వకల్లు: కాల్వబుగ్గలో పూజలు



మాట్లాడుతున్న కోడుమూరు ఎమ్మెల్యే దస్తగిరి

నైపుణ్యం పెంచుకోవాలి

కర్నూలు రూరల్ నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): విద్యతో పాటు నైపుణ్యం పెంచుకోవాలని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి పేర్కొన్నారు. సోమవారం బి.తాండ్రపాడు ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ ఆధర్వర్యంలో నిర్వహించిన ప్రధానమంత్రి నేషనల్ అప్రెంటిషిప్ మేళాలో పాల్గొన్నారు. ప్రభుత్వం యువతీ,యువకులకు స్వయంఉపాధి శిక్షణ ఇచ్చి, ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు అనేక పథకాలను అమలు చేస్తోందన్నారు. ప్రిన్సిపాల్, అధ్యాపకులు, బి.తాండ్రపాడు సర్పంచ్ జయన్న, తదితరులు పాల్గొన్నారు.

ఆదోని అభివృద్ధిపై కీలక భేటీ

● మంత్రి నిమ్మల రామానాయుడికి వినతి

ఆదోని, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆదోని నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన కీలక అంశాలపై జిల్లా ఇన్‌చార్జి, రాష్ట్ర మంత్రి నిమ్మల రామానాయుడితో ఏపీ కురువ కార్పొరేషన్ చైర్మన్ దేవేంద్రప్ప, టీడీపీ సీనియర్ నేత ఉమాపతినాయుడు, ఆరేకల్ రామ కృష్ణ సమావేశమయ్యారు. సోమవారం ఆదోని నియోజకవర్గం సమస్య లతో కూడుకున్న వినతి పత్రాన్ని మంత్రికి అందజేశారు. ఈ సంద ర్భంగా ఉమాపతినాయుడు ఆంధ్రజ్యోతితో మాట్లాడారు. ఆదోనిని జిల్లాగా ప్రకటించి నాలుగు మండలాలుగా విభజించాలని కోరారు. చిన్నగోనేహాల్ గ్రామంతోపాటు అలసందగుత్తి గ్రామాన్ని ప్రత్యేక పంచాయతీలుగా ఏర్పాటు చేయాలని కోరారు. ఆరేకల్ గ్రామంలో మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్, మైనార్టీ ఐటీఐ రెసిడెన్షియల్ కాలేజ్, ఉర్దూ జూనియర్ బాలికల కాలేజ్ వంటి విద్యాసంస్థల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. ఆదోని షాహిఈద్‌గాహ్ పునర్ని ర్మాణం, ముస్లీంల శ్మశాన వాటికకు కాంపౌండ్ వాల్, ఇతర సదుపా యాల కోసం నిధులు ఇవ్వాలని విన్నవించినట్లు తెలిపారు. పంచాయ తీరాజ్ శాఖ పరిధిలో బసాపురం వంకపై బ్రిడ్జి నిర్మాణం, పెద్దహరివా నం-నాడంగ రోడ్, ఆదోని-సిరుగుప్ప రోడ్‌కు మరమ్మతులు, కపటి-నాగ లాపురం రోడ్‌కు నిధులు కేటాయించాలని కోరారు. అందుకు మంత్రి నిమ్మల రామానాయుడు సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.. సీఎం చంద్రబాబు, లోకేష్, పవన్‌కళ్యాణ్ దృష్టికి ఈ అంశాలను తీసు కెళ్లి సంబంధిత శాఖల అధికారులతో చర్చించి ఆదోని నియోజకవర్గ అభివృద్ధి పనులకు అవసరమైన నిధులు మంజూరు చేయడానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారన్నారు. టీడీపీ ముస్లీం మైనార్టీ నాయకులు అల్తాఫ్, ఆరిఫ్, జాఫర్, టీడీపీ మండల ప్రధాన కార్యద ర్శులు వెంకటప్ప, క్రిష్టప్పలు పాల్గొన్నారు.



సమస్యలపై వినతి పత్రం ఇస్తున్న టీడీపీ సీనియర్ నేత ఉమాపతినాయుడు

పత్తి రైతులను ఆదుకోవాలి

● రైతు సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు రామచంద్రయ్య



మాట్లాడుతున్న ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

ఆదోని అగ్రికల్చర్ , నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో అధిక వర్షాలతో పంట నష్టపోయిన పత్తి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు రామచంద్రయ్య, రాష్ట్ర కార్యదర్శి జగన్నాథం అన్నారు. సోమవారం ఈనెల 17న జరిగే రాష్ట్ర పత్తి రైతుల సమ్మేళనం విజయవంతం చేయాలని జిల్లా సమితి సమావేశం జరిగింది. ముఖ్య అతిథులుగా హాజరైన వారు మాట్లాడుతూ ఈనెల 17న ఆదోనిలో రాష్ట్ర పత్తి రైతుల సమ్మేళనం జరగనుంది తెలిపారు. ప్రతి గ్రామం నుంచి సమ్మేళనానికి భారీగా రైతులు తరలి రావాలని పిలుపునిచ్చారు. జిల్లా అధ్యక్షుడు నాగేంద్రయ్య, కార్యదర్శి పంపన్న గౌడ్, తిమ్మయ్య, జిల్లా సభ్యులు సుదర్శన్, వీరేష్, కల్లుబావి రాజు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో జైలుశిక్ష

ఆదోని రూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మద్యం సేవించి వాహనం నడిపిన వ్యక్తికి కోర్టు జైలు శిక్ష విధించింది మద్యం సోమవారం ఇన్‌స్పెక్టర్ ఎస్.ఐ మహేష్ కుమార్ సిబ్బందితో కలిసి ఢణాపురం క్రాస్‌వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. ఆదోనికి చెందిన వ్యక్తి మద్యం సేవించి వేగంగా ద్విచక్ర వాహనాన్ని నడుపుతూ, పోలీసులకు పటుబడ్డాడు. నేరం రుజువు కావడంతో నింధితుడికి 14రోజులు రిమాండ్ విధిస్తూ, సెకండ్ అడిషనల్ జెఎఫ్‌సిఎం జడ్జి శ్రీవల్లి తీర్పు ఇచ్చినట్లు ఎస్.ఐ తెలిపారు.

అందెశ్రీకి ఎస్టీయూ నివాళి



పత్తికొండలో నివాళి అర్పిస్తున్న నాయకులు

పత్తికొండ టౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): పత్తికొండ పట్టణంలో సోమవారం ప్రముఖ రచయిత, ప్రజాకవి అందెశ్రీకి అరసం, ఎస్టీయూ నాయకులు నివాళులు అర్పించారు. స్థానిక ఎస్టీయూ కార్యాలయంలో సంఘం నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అలాగే తెలుగు సూర్యుడు సీపీ.బ్రౌన్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.ఎస్టీయూ నాయకులు వీరస్వామి, బలరాముడు, వీరప్ప, వెంకటరాముడు, రామచంద్ర పాల్గొన్నారు.

మెగా కాంప్లెక్స్ నిర్మాణానికి మోక్షం

ఆదోని టౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): పట్టణం నడిబొడ్డులోని పాత బస్టాండ్ స్థలంలో ఒకటిన్నర ఏడాదిగా నిలిచిపోయిన మునిసిపల్ మెగా కమర్షియల్ షాపింగ్ కాంప్లెక్స్ పనులు ఎట్టకేలకు సోమవారం ప్రారంభం అయ్యాయి. రూ. 33 కోట్ల అంచనాలతో మూడు అంతస్థుల నాలుగు భవనాలను గుడ్‌విల్ పద్ధతిలో గత ప్రభుత్వ హయాంలో పనులను ప్రారంభించారు. కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వ 25 శాతం కన్నా తక్కువగా జరిగిన పనులను నిలుపుదల చేయాలని జారీ చేసిన ఉత్తర్వుల కారణంగా పనులు ఆగిపోయాయి. ఈ కాంప్లెక్స్ నిర్మాణం పనులు ప్రారంభించడానికి అనుమతి లభించింది. ఏడాదిన్నర నుండి పనులు ఆగిపోవడంతో జేఎన్‌టీయూ(అనంతపురం)కు చెందిన నిపుణులు చేసిన సూచనల మేరకు పనులు తిరిగి ప్రారంభమయ్యాయి. గుడ్‌విల్ పద్ధతిలో షాపులను దక్కించుకొన్న లీజుదారులు హర్షం వ్యక్తం చేశారు.

వీఆర్వోపై కేసు నమోదు చేయాలి



సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఏవోకు వినతిపత్రం ఇస్తున్న బాధితులు

ఆదోని అగ్రికల్చర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : పెద్ద కడుగురు మండలం కల్లుకుంట గ్రామంలో దళిత భూములను అన్యాక్రాంతం చేసిన నాటి వీఆర్‌వో మహబూబ్ బాషాపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని ఆ గ్రామ దళితులు మాదిగ మల్లేమ్మ, మాదిగ అబ్రహం, మాదిగ చిన్నన్న, తిక్కన్న, చంద్రన్న కోరారు. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయం ఏవో వసుంధర కలిసి వారు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1994లో తమకు భూమిలేదని ప్రభుత్వం సర్వే నెంబర్ 514 లో భూమి పంచి పట్టాలిచ్చారన్నారు. సాగు చేసుకుంటున్న తమను మాజీ వీఆర్‌వో మెహబూబ్ భాష ప్రభుత్వం పట్టాలు మంజూరు చేయలేదని సాగు చేసుకోవద్దన్నారు. ఈ భూములను తాను వేరే వారికి అమ్ముకున్నారని ఆరోపించారు. వారికి పట్టాలు మంజూరు చేయడం దుర్మార్గమన్నారు. ఆ పట్టాలు రద్దు చేసి వీఆర్‌వోపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పక్కీరప్ప స్వామికి కార్తీకమాస పూజలు

తుగ్గలి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం పురస్కరిం చుకుని ఫక్కీరప్ప స్వామికి కార్తీకమాస పూజలు వైభవంగా నిర్వహిం చారు. సోమవారం మండలంలోని బోడిబండలో ఫక్కీరప్ప స్వామి దేవా లయంలో కార్తీకమాసం పురస్కరించుకుని ఆలయంలో దీపాలు వెలి గించి స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే విచ్చేసిన భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. భక్తుల కాలక్షేపం కోసం వివిద సాంస్కృ తిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రాంపురం మల్లయ్య, మద్దిలేటి చౌదరి తదితరులు పాల్గొన్నారు.

కంప చెట్ల తొలగింపు

వెల్దుర్తి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన వెల్దు ర్తిలో ఎల్లమ్మ దేవాలయానికి వెళ్లే దారి ముళ్లపొదలతో మూసుకుపో యింది. ఇదే దారిలో నేలమోరి బ్రిడ్జి కూడా నీటితో పాచిపట్టింది. సోమ వారం మాజీ ఎంపీపీ జ్ఞానేశ్వర్‌గౌడు ఆధ్వర్యంలో జేసీబీ సాయంతో మురుగునీటిని, రోడ్డుకు ఇరువైపులా ముళ్ల పొదలను తొలగించడంతో భక్తులు సంతోషం వ్యక్తం చేశారు.

చిన్నారుల అస్వస్థతపై ఆరా



అంగన్‌వాడీ కార్యకర్తలతో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ అజయ్‌కుమార్

ఆదోని, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ఆదోని మండలంలోని నాగులాపురం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో కొందరు చిన్నారులు అస్వస్థతకు గురైన సంఘటనపై ఇన్‌చార్జి సబ్‌కలెక్టర్ అజయ్‌కుమార్ సోమవారం రాత్రి ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. అస్వస్థతకు గురైన చిన్నారులందరికీ వైద్యులు పూర్తి ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ప్రస్తుతం ఎటువంటి ప్రమాదం లేదని, పిల్లల ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని అధికారులు తెలిపారు. ఇటువంటి సంఘటనలు పునరావృత్తంగాకుండా ఉండేందుకు ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కేంద్రంలో ఏ చిన్న సమస్య వచ్చినా వెంటనే ఆరోగ్య కార్యకర్త, మెడికల్ ఆఫీసర్‌ని సంప్రదించాలని సిబ్బందికి తెలియజేశారు.

ఆసుపత్రి అభివృద్ధికి కృషి



ఆసుపత్రి సూపరింటెండెంట్‌తో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

వెల్దుర్తి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన వెల్దుర్తిలో ఉన్న సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని మండల అధ్యక్షుడు బలరాంగౌడు, సింగిల్‌విండో చైర్మన్ రమాకాంత్‌రెడ్డి సందర్శించారు. ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలపై సూపరింటెండెంట్ బాలచంద్రారెడ్డితో అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి సమస్యలపై ఆరా తీశారు. ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు సహకారంతో ఆసుపత్రి అభివృద్ధికి కృషిచేస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో ఎర్రబజారు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయిలో రాణించాలి



డీఈవో చేతుల మీదుగా అవార్డు తీసుకుంటున్న ఆదర్శ పాఠశాల విద్యార్థినులు

మద్దికెర, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మద్దికెర ఆదర్శ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థినులు వృత్తి, నైపుణ్య శిక్షణా పోటీల్లో రాష్ట్ర స్థాయిలో కూడా రాణించాలని ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ నాగరాజు సోమవారం కోరారు. ఆదర్శ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులు కర్నూలులో ఏపీ సమగ్ర శిక్ష వారు నిర్వహించిన జిల్లా స్థాయి వృత్తి నైపుణ్య శిక్షణ పోటీల్లో ప్రతిభ కనబరిచి మోడల్ స్కూల్ విద్యార్థులు అగ్రికల్చర్ విభాగంలో మొదటి బహుమతి రావడంతో డీఈవో శామ్యూల్ పాల్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నందుకు ఆ విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ కావ్య, సుమంజలి, ఇందు అనే విద్యార్థినులు జిల్లా స్థాయిలో రాణించడం అభినందనీయమన్నారు. రాష్ట్రస్థాయిలో ఎంపికయ్యారనీ, అక్కడ కూడా రాణించాలని కోరారు. ప్రతి ఒక్కరూ చదువుతో పాటు క్రీడలపైన కూడా దృష్టి పెడితే ఏ రంగంలోనైనా రాణిస్తారన్నారు. ఉపాధ్యాయులు కార్తిక్ పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ల వద్ద అన్ని పత్రాలు ఉండాలి



ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ, ఎస్ఐ

వెల్దుర్తి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రమైన వెల్దుర్తి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలో సీఐ యుగంధర్ ఆటో డ్రైవర్లకు కౌన్సె లింగ్ నిర్వహించారు. వాహనానికి సంబంధించిన ఆర్‌సీ, ఇన్సూరెన్స్, డ్రైవర్ లైసెన్సు అన్ని పత్రాలు ఆటో డ్రైవర్లు కలిగి ఉండాలని అన్నారు. పరిమితికి మించి ఆటోలలో ప్రయాణీకులను ఎక్కించకోరాదన్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించరాదన్నారు. రోడ్డు భద్రత నియమాలు తప్పక పాటించాలని ఆదేశించారు. ఎవరైనా ఉపేక్షిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎస్ఐ నరేశ్, పోలీసు సిబ్బంది, ఆటోడ్రైవర్లు పాల్గొన్నారు.

ప్రైవేటీకరణను ఆపాలి: ఎమ్మెల్యే



కోటి సంతకాల సేకరణలో పాల్గొన్న ఎమ్మెల్యే విరుపాక్షి

హొళగుంద , నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేసేందుకు కూటమి ప్రభుత్వం కుట్ర చేయడం తక్షణమే ఆపాలని ఆలూరు నియోజకవర్గం ఎమ్మెల్యే వీరుపాక్షి డిమాండ్ చేశారు. హొళగుందలోని బస్టాండ్‌లో కోటి సంతకాల సేకరణ సందర్భంగా వైసీపీ నాయకులు, ప్రజలతో సమావేశం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వైసీపీ మండల్ కన్వీనర్ షఫీయల్లా, వైసీపీ జిల్లా ఉపా ధ్యాక్షుడు ఎస్కే గిరి, కోగిలాతోట శేషప్ప, వందవాగలి శేషప్ప, కోగిలాతోట యళ్ళప్ప పాల్గొన్నారు.

మార్కెట్‌యార్డు అభివృద్ధికి ప్రభుత్వం కృషి

- ప్రభుత్వంపై విమర్శలు చేస్తే ఎమ్మెల్యేను తిరగనివ్వం
- అసెంబ్లీకి వెళ్లకుండా ప్రెస్‌మీట్‌లకే పరిమితమైన ఎమ్మెల్యే
- ఎమ్మెల్యేపై విమర్శలు గుప్పించిన వైకుంఠం జ్యోతి

ఆలూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆలూరు మార్కెట్ యార్డు అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర విత్తన అభివృద్ధి సంస్థ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి, ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతి, వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ బుజ్జమ్మ, ఆలూరు పరిశీలకులు గంజి నాగరాజు అన్నారు. సోమవారం నూతనంగా ఎన్నికైన మార్కెట్‌యార్డు పాలకవర్గ ప్రమాణ స్వీకారం సందర్భంగా పట్టణంలో టీడీపీ కార్యకర్తలు, నాయకులు భారీ ర్యాలీ చేపట్టారు. అనంతరం మార్కెట్‌యార్డులో నిర్వహించిన ప్రమాణ స్వీకార కార్యక్రమం చేపట్టారు. యార్డు కార్యదర్శి సునీత, మార్కెట్‌యార్డు చైర్మన్ బిల్లేకల్ వెంకటేష్, వైస్ చైర్మన్‌గా నియామకమైన రంగడు, డైరెక్టర్‌ల చేత ప్రమాణ స్వీకరణ చేయించారు. అనంతరం టీడీపీ ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతి, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి వైకుంఠం శివప్రసాద్‌లు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో జగన్ అభివృద్ధిని పక్కనపెట్టి విస్మరించారన్నారు. ఓ సామాన్య దళిత సామాజిక వర్గానికి చెందిన బిల్లేకల్ వెంకటేష్‌కు మార్కెట్‌యార్డు చైర్మన్ పదవి ఇచ్చిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ప్రభుత్వంపై ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి చేస్తున్న విమర్శలు తిప్పి కొడతామన్నారు. యార్డు, డైరెక్టర్‌లు ఈడిగ మాధవి, బోయ సరోజ, గొల్ల సుదర్శన్, కె.సరస్వతి, కె.పార్వతి, కోసి.శ్రీనివాసులు, వనతిబాయి, హెచ్.లక్ష్మీ, బండారు మారుతి, ఉసిని .లక్ష్మీ, పి.లక్ష్మీ, పైగేరి కురువ గోపాల్, ఎం.నబీరసూల్, మండల కన్వీనర్లు అశోక్, సుధాకర్, విజయ్, వల్లి, తిప్పయ్య, టీడీపీ నాయకులు విష్ణు, సీనప్ప, ఉచ్చీరప్ప, శ్రీదర్, కురువ హనుమప్ప, ఈరన్న, నరసప్ప పాల్గొన్నారు.



ఊరేగింపులో పాల్గొన్న రాష్ట్ర సీడ్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి, టీడీపీ ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతి, కప్పట్రాళ్ల బుజ్జమ్మ, చైర్మన్ వెంకటేష్



ప్రమాణ స్వీకారం చేస్తున్న చైర్మన్ వెంకటేష్, పక్కన వైకుంఠం జ్యోతి

ఉప్పర సంఘం డైరెక్టర్‌గా ప్రసాద్

క్రిష్ణగిరి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ఉప్పర సంఘం రాష్ట్ర డైరెక్టర్‌గా మాదాపురం ఎల్.వి.ప్రసాద్‌ను నియమిస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటన చేసింది. 2016 నుంచి తెలుగుదేశం పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని, 2019 నుంచి 2024 మధ్యన వైసీపీ నాయకుల నుంచి వేధింపులు, ఆగడాలకు వ్యతిరేకంగా తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలకు అండగా ఉంటూ కర్నూలు పార్లమెంటు లీగల్ సెల్ ప్రధాన కార్యదర్శిగా సేవలందించారు. పార్టీకి అందించిన సేవలకు గుర్తింపుగా ఉప్పర సంఘం రాష్ట్ర డైరెక్టర్‌గా ఎల్.వీ. ప్రసాద్ ను నియమిస్తూ ప్రకటన చేసింది. తనకు బాధ్యతలు అప్పగించిన పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారాలోకేశ్‌కు మదాపురం ఎల్.వీ.ప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు.



మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ అన్యాయం

మద్దికెర, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేయడం అన్యాయమనీ.. వైసీపీ మండల అధ్యక్షుడు మల్లికార్జున యాదవ్, ఉపాధ్యక్షులు కృష్ణ యాదవ్, జిల్లా వైసీపీ ఎస్సీ సెల్ అధ్యక్షులు రేలంపాడు వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఈ నెల 12వ తేదీన వైసీపీ ఆధ్వర్యంలో చేపట్టనున్న ప్రజా ఉద్యమ ర్యాలీ పోస్టర్‌ను విడుదల చేశారు.

విశ్వబ్రాహ్మణ సంఘం తాలూకా అధ్యక్షుడిగా సిద్ధయ్య ఆచారి

ఆలూరు రూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): విశ్వబ్రాహ్మణ హక్కుల పోరాట సమితి తాలూకా అధ్యక్షులుగా పెద్దహోతూరు గ్రామానికి చెందిన మఠం సిద్ధయ్య ఆచారి ఎన్నికయ్యారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ విశ్వబ్రాహ్మణుల హక్కుల సాధన కోసం కృషి చేస్తానని తెలిపారు. కమ్మర, వడ్రంగి, శిల్ప, స్వర్ణకార, పురోహితులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సాహం, గుర్తింపు అందించాలని కోరారు. తనకు తాలూకా అధ్యక్షులుగా అవకాశం కల్పించిన రాష్ట్ర అధ్యక్షులు కమ్మర హరికృష్ణ ఆచారికి కృతజ్ఞతలు తెలిపారు.

రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక



పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

తుగ్గలి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయిలో జరిగిన ఖో-ఖో పోటీల్లో విద్యార్థులు ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పీఈటీల సంఘం జిల్లా కార్యదర్శి చందు నాయక్, ప్రధానోపాధ్యాయులు అగస్టీన్ తెలిపారు. సోమవారం మండల కేంద్రమైన తుగ్గలి జిల్లా పరిషత్ హై స్కూల్‌లో నంద్యాల జిల్లాలో జరిగిన జిల్లా స్థాయి అండర్-17 ఖో-ఖో పోటీల విభాగంలో రంజిత్, పవన్, అరుణ్, పవిత్ర ఎంపిక కాగా, అండర్-14లో కార్తీక్, రేణుకలు ఎంపికయ్యారు. దీంతో విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు. సుధాకర్ గౌడు, శ్రీను, గంగాదేవి, నూర్జహాన్ తదితరులు ఉన్నారు.

దాతలకు ప్రశంసా పత్రాలు అందజేత

ఆదోని టౌన్ , నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని 29వ వార్డు కౌన్సిలర్ నాగరత్నమ్మ, చంద్రశేఖరయ్య దంపతులు క్షయ వ్యాధిగ్రస్తులకు ఐదు నెలల పాటు దత్తతకు తీసుకొని పోషక ఆహార కిట్లను అందజేసినందుకు టీబీ యూనిట్ మెడికల్ ఆఫీసర్లు డా. అనిల్ సాగర్, డా శేఖన్ భానుకు ప్రశంసా పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సూపర్వైజర్‌లు బాబురాజు, సీతారాముడు, చంద్రశేఖర్, ఇందిరా దొరతి, హెల్త్ విజిటర్ సుబ్బమ్మ బాయి, సిబ్బంది పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

మద్దికెర, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల్లో సాగు చేసుకున్న పంటలకు తెగుళ్లు సోకకుండా తక్షణమే సస్యరక్షణ చర్యలు చేపట్టాలని వ్యవసాయ శాఖ అధికారి రవి తెలిపారు. సోమవారం మండల పరిధిలోని ఎం.అగ్రహారం గ్రామంలో కంది, టమోటా పంటలను పరిశీలించి పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. కంది పంట పూత దశలో ఉన్నందున పురుగులు, తెగుళ్ల సోకకుండా ఫ్లోరోఫైర్పాస్ వేప న ఊనె పిచికారి చేయాలని పిలుపునిచ్చారు. అదేవిదంగా రైతులు తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆదాయం వచ్చే మార్గాలను సాగు చేసుకోవాలన్నారు. ప్రతి పంటను ఈపంట ద్వారా నమోదు చేసుకోవాలని అన్నారు. వ్యవసాయశాఖ అధికారుల సలహాలు తీసుకోవాలన్నారు. అధిక మోతాదులో మందులు వాడకూడదన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది బోజరాజు, ఆనంద్ ఉన్నారు.


దిగుబడి తగ్గిన ఆముదం



ఆముదం పంట

దేవనకొండ, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్లో కురిసిన అధిక వర్షాలకు ఆముదం పంట దిగుబడి తగ్గింది. వర్షాలకు ఆముదం మొక్కలు ఏపుగా పెరిగిన, కాయ లేకపోవడంతో పంట దిగుబడి తగ్గిపోయింది. తేమశాతం అధిక కావడంతో చెట్లు ఆకులు , పూత రాలిపోయి దిగుబడిపై ప్రభావం చూపింది. ఖరీఫ్ సీజన్లో పత్తి, వేరుశెనగ పంటల తరువాత అధికంగా సాగు చేసే పంట ఆముదం. మండలంలోని చెల్లెలచెలిమల, నల్లచెలిమల గుండ్లకొండ ,కప్పట్రాళ్ల, నెల్లిబండ తదితర గ్రామాలలో ఆముదం పంటను 1247 హెక్టార్లకు పైగా రైతులు సాగు చేశారు. పంట సాగుకు ఎకరాకు రూ.25 వేల వరకు ఖర్చు వస్తుంది. పంట దిగబడి సాదారణంగా ఎకరాకు 8 నుండి పది క్వింటాళ్ల మేరా రావాలి. ఈ ఏడాది కురిసిన వర్షాలకు దిగుబడి సగానికి తగ్గిపోవడంతో రైతులపై పెట్టుబడి భారం పడింది.

మూడున్నర ఎకరాలు సాగు చేశా



మూడున్నర ఎకరాలలో ఆముదం పంట రూ.80 వేల పెట్టుబడితో సాగు చేశా. వర్షాలు ఎక్కువై ఎకర పంట చెట్ల ఆకులు, పూత, కాయలు రాలీపోయింది. అధిక తేమతో చెట్లు చనిపోయ్యాయి. చెట్టు పెరిగింది కానీ కాయలేదు. ఎకరాకు ఐదు క్వింటాళ్లు దిగుబడి వచ్చింది. పెట్టుబడి కుడా వెళ్లని పరిస్థితి నెలకొంది.

అజీమ్ రైతు దేవనకొండ

సీసీ రోడ్లు, డ్రైనేజీల ఏర్పాటుకు చర్యలు

ఎమ్మిగనూరు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 24వ వార్డు శివారులో సీసీ రోడ్లు, డ్రైనేజీలు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి తెలిపారు. సోమవారం వార్డుకు చెందిన పలువురు మహిళలు ఎమ్మెల్యేను ఇంటి దగ్గర కలిసి సమస్యలు వివరించారు. ఇందుకు స్పందించిన ఎమ్మెల్యే వెంటనే వార్డులో మున్సిపల్ అధికారులతో కలిసి పర్యటించారు. వార్డులో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకొని వాటిని వెంటనే పరిష్కరించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. అలాగే సీసీరోడ్లు, డ్రైనేజీలు ఏర్పాటుకు వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. త్వరలో సీసీ రోడ్లు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే తాగునీటి పైప్‌లైన్ లీకేజీతో మురుగునీరు కలుషితం అవుతున్నాయని కాలనీ వాసులు తెలపడంతో సమస్యను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణ తాగునీటి సమస్యను తీర్చేందుకు జీడీపీ నుంచి పైప్‌లైన్ మంజూరు చేయంచటం జరిగిందాన్నరు. త్వరలో పనులు ప్రారంభమవుతాయన్నారు. అలాగే శివారు కాలనీల అభివృద్ధికి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, హౌసింగ్ డీఈ ప్రసాద్, వార్డు టీడీపీ ఇన్‌చార్జీ వెంకటేశ్వర రెడ్డి, టీడీపీ పట్టణ అధ్యక్షులు మాచాని మహేష్, నాయకులు బుగిడే నాగరాజు, డీలర్ బాషా, రంగస్వామిగౌడ్, ఉరుకుందు, ఉప్పర రవి, గిడ్డయ్య పాల్గొన్నారు.



పట్టణంలోని 24వ వార్డులో సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే జయనాగేశ్వర రెడ్డి

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

ఎమ్మిగనూరు రూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అధిక వర్షాల వల్ల నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కాంగ్రెస్ పార్టీ ఎమ్మిగనూరు నియోజకవర్గ కో-ఆర్డినేటర్ కాశింవలి, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షులు వీరేష్‌యాదవ్ డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్ శేషఫణిని కలిసి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ కార్యక్రమంలో షబ్బీర్, ఆసిఫ్, లోకేష్, అన్సర్ పాల్గొన్నారు.

రేపు ప్రజా ఉద్యమ ర్యాలీ



కరపత్రాలను విడుదల చేస్తున్న సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు ప్రదీప్‌రెడ్డి, విశ్వనాథరెడ్డి, పురుషోత్తంరెడ్డి

మంత్రాలయం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రభుత్వ చేస్తున్న వ్యతిరేఖ విధానాలకు ప్రజల పక్షాన పోరాటం చేస్తూ బుధవారం మంత్రాలయంలో ప్రజా ఉద్యమ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు మంచాల సింగిల్‌విండో మాజీ అధ్యక్షులు, వైసీపీ జిల్లా ఉపాధ్యక్షులు ప్రదీప్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి పురుషోత్తంరెడ్డి, వైసీపీ జిల్లా కార్యదర్శి సీవీ విశ్వనాథరెడ్డి అన్నారు. సోమవారం ఎమ్మిగనూరు భీమా నిలయంలో ఉద్యమ ర్యాలీ వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. చంద్రశేఖర్ రెడ్డి, రమాకాంత్‌రెడ్డి, చంద్రశేఖర్, పెద్దయ్య, దేవదానం పాల్గొన్నారు.

మెడికల్ కళాశాలల కోసం కలిసి పోరాడుదాం



రచ్చుమర్రి గ్రామంలో కోటి సంతకాలు సేకరిస్తున్న గుర్రెడ్డి భీమిరెడ్డి, నాయకులు

మంత్రాలయం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 17 మెడికల్ కళాశాలలు ప్రైవేటీకరణ కాకుండా పోరాటంచేసి కాపాడుకుందామని వైసీపీ మండల అధ్యక్షులు గుర్రెడ్డిభీమిరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని రచ్చుమర్రి గ్రామంలో రాంపురం రెడ్డి సోదరులు ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి, సీతారామిరెడ్డి, ప్రదీప్‌రెడ్డి ఆదేశాల మేరకు మెడికల్ కళాశాలల విధానాన్ని నిరసిస్తూ కోటి సంతకాల సేకరణను జడ్పీటీసీ గోవిందమ్మ, సర్పంచు మేకల సుజాత, ఎంపీటీసీలు మజ్జిగ నర్సమ్మ, జయలక్ష్మి, మజ్జిగ బొజ్జప్ప, రోగప్ప, మేకల నారాయణ, ఉపసర్పంచు ఉరుకుంద ఆధ్వర్యంలో నిర్వహించారు. సమావేశంలో వైసీపీ నాయకులు జెట్టి వీరేష్, ఈరన్నగౌడు, వెంకోబ, శ్రీనివాసులు, దుబ్బన్న, ఈరన్న, శంకరప్ప, రాజు, లక్ష్మప్ప పాల్గొన్నారు.

గోనెగండ్ల: కూటమి ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించడం ప్రజా ఆరోగ్యానికి ప్రమాదకరం అని మాజీ ఎంపీపీ, వైసీపీ మండల కన్వీనర్ కృష్ణారెడ్డి, జిల్లా వైసీపీ యాక్టివిటి కార్యదర్శి బందేనవాజ్, మాజీ మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ మన్సూర్ అన్నారు. వైసీపీ కార్యాలయం దగ్గర 12న చేపట్టనున్న ప్రజాఉద్యమం పోస్టర్‌ను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఆ మెడికల్ కళాశాలలను ప్రవేట్ వ్యక్తులకు విక్రయించేందుకు కుట్రపన్నుతున్నారని వారు ఆరోపించారు. కార్యక్రమంలో, చికెన్ రాజా, గంగాధర్, ఉల్చాల రంగన్న నాయుడు, మండల వైస్‌ఎంపీపీ వెంకటరామిరెడ్డి, శివరాముడు, కటిక మాబు, కాజా పటేల్, కల్లపారి రఘు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా బసవన్న ఆలయ ప్రారంభోత్సవం



టీడీపీ నాయకులను సన్మానిస్తున్న గ్రామ పెద్దలు

కౌతాళం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ఎరిగేరి గ్రామంలో నిర్మించిన నూతన బసవన్న దేవాలయం ప్రారంభోత్సవ కార్యక్రమం సోమవారం గ్రామస్థుల సహకారంతో ఘనంగా ప్రారంభించారు. గ్రామంలో పురాతన ఆలయం ఉండడంతో అది శిథిలావస్థకు చేరడంతో గ్రామస్థులు దాతల సహకారం, విరాళాలు సేకరించి అదే స్థానంలో నూతన దేవాలయనిన్ని నిర్మించారు. దేవాలయంలో బసవేశ్వరుడు, శివలింగం, గణపతి విగ్రహాలను తయారు చేసి ప్రతిష్ఠించారు. ఆలయ ప్రారంభోత్సవ సందర్భంగా గ్రామంలో ప్రతి ఇల్లు బంధువులతో సందడిగా మారింది.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



చెక్కును అందజేస్తున్న జిల్లా ఉపాధ్యక్షుడు చెన్నబసప్ప

కౌతాళం, నవంబరు 10(ఆంధ్ర జ్యోతి): ముఖ్యమంత్రి రిలీఫ్ ఫండ్ పేదలకు వరమని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు చెన్న బసప్ప అన్నారు. కౌతాళంలో ఆయన మండలంలోని కుంటనహల్ గ్రామానికి చెందిన అరుణ్ కుమార్‌కు ముఖ్యమంత్రి సహాయ నిధి కింద రూ.1,58, 375 చెక్కు మంజూరు కావడంతో బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ టీడీపీ నాయకుడు దొడ్డన గౌడ్, మండల నాయకుడు దొమ్మలదిన్నె రమేష్‌గౌడ్, టీడీపీ నాయకులు సిద్దు, మంజునాథ, సోమన్న, కోడిగుడ్ల రామాంజిని ఉన్నారు.

బంధువులకు మతిస్థిమితం లేని మహిళ అప్పగింత

మంత్రాలయం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): తుంగభద్ర నది ఒడ్డున దీనావస్థలో పడిఉన్న సరస్వతి అనే మతిస్థిమితం లేదని మహిళను బంధువులకు అప్పగించారు. సోమవారం మంత్రాలయం ఎస్ఐ శివాంజల్ ట్రాఫిక్ నివారించేందుకు తిరుగుతుండగా అనాథగా పడిఉన్న ఆమెను చూసి చలించి భోజనం పెట్టి నీరుఇచ్చి ఆదుకున్నారు. ప్రొటోకాల్ కానిస్టేబుల్ రంగస్వామి, జంగం బసవరాజు సహాయంతో ఆమె వివరాలను తెలుసుకున్నారు. ఎమ్మిగనూరు మండలం గుడెకల్లుకి చెందిన సరస్వతి అలియాస్ ఈరమ్మ మతిస్థిమితం లేదు. భర్త సోమన్న మృతిచెందాడు. పిల్లలు లేకపోవడంతో ఒంటరిగా జీవించేది. దీనావస్థలో భక్తులు ఇస్తున్న తినుబండారాలతో కడుపు నింపుకు నేది. గుడెకకల్లులో ఉన్న తల్లి లక్ష్మీదేవి, వదిన సరస్వతికు అప్పగించి ఆమెను ఆదుకోవాలని సూచించారు. అనాథగా పడివున్న మహిళను చేరదీసి మానవత్వంతో గూటికి చేర్చిన ఎస్ఐ శివాంజల్, కానిస్టేబుల్ రంగస్వామిలను అభినందించారు.

సమస్యలను వెంటనే పరిష్కరించండి

● ఆదోని సబ్ కలెక్టర్ అజయ్ కుమార్



మంత్రాలయం తహసీల్దారు కార్యాలయంలో గ్రీవెన్స్‌లో పాల్గొన్న ఆదోని సబ్ కలెక్టర్ అజయ్‌కుమార్

మంత్రాలయం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆయాగ్రామాల నుంచి వచ్చే ప్రజల ఫిర్యాదులను వెంటనే పరిష్కరించేందుకు కృషిచేయాలని ఆదోని సబ్‌కలెక్టర్ అజయ్‌కుమార్ అన్నారు. సోమవారం మంత్రాలయం తహసీల్దార్ కార్యలయంలో గ్రీవెన్స్ లో పాల్గొన్నారు. సందర్భంగా ఆయన మాట్లడుతూ ప్రతి సోమవారం ప్రజాసమస్యల వేదికలో ఫిర్యాదు చేసుకున్న సమస్యను ఆన్‌లైన్ నమోదుచేసి పరిష్కరించి న్యాయం చూపాలని ఆదేశించారు. భూసర్వేలో నిక్కచ్చిగా రైతుల సహకారంతో ముందుకు వెళ్లాలని సూచించారు. భూ సమస్యలపై వస్తున్న ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించి రైతులకు మేలు జరిగే విధంగా చూడాలన్నారు. రేషన్‌బియ్యం లబ్దిదారులకు అందాలని పక్కదారి పట్టకుండా చూడాల్సిన బాధ్యత తహసీల్దారు, ఆర్ఐ, వీఆర్‌వోలపై ఉందని అన్నారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దారు జీకే గురు రాజరావు, జయరామిరెడ్డి, పంచాయితీరాజ్ ఏఈ మల్లయ్య, సూపరిటెండెంట్ రాధ, ఆర్ఐ జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు త్రీ స్టార్ హోటల్‌కు సీఎం వర్చువల్‌గా శంకుస్థాపన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు

మంత్రాలయం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి) : మంత్రాలయం పుణ్యక్షేత్రంలో కూటమి ప్రభుత్వం వెంకటేశ్వర త్రీస్టార్ హోటల్‌కు నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దాదాపు రూ30కోట్లతో 120 గదులు,కళ్యాణ పంటపం,రెస్టారెంటు నిర్మించే పనులకు అమరావతి నుంచే రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మంగళవారం వర్చువల్‌గా శంకుస్థాపన చేసున్నట్లు అబోడే హోటల్ మేనేజర్ రజినీకాంత్ తెలిపారు. మంత్రాలయానికి వ్యవసాయ శాఖమంత్రి అచ్చెంనాయుడు, కలెక్టర్ సిరి, ఆదోని సబ్‌కలెక్టల్ అజయ్‌కుమార్, టీడీపీ జిల్లా అధ్యక్షులు తిక్కారెడ్డి, ఎమ్మిగనూరు,ఆదోని ఎమ్మెల్యేలు జయనాగేశ్వరరెడ్డి, పార్థసారథి, మంత్రాలయం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జీ రాఘవేంద్ర రెడ్డి పాల్గొంటారని తెలిపారు. సోమవారం ఏర్పాట్లను అధికారులు పరిశీలించారు. దాదాపు 400మందికి ఉపాధి కల్పిస్తామని అన్నారు.

ఎమ్మిగనూరులో ఆకస్మిక తనిఖీలు



ఎమ్మిగనూరులో వాహనాన్ని తనిఖీ చేస్తున్న పోలీసులు

ఎమ్మిగనూరు టౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : భారత దేశ రాజధాని ఢిల్లీలో ఎర్రకోట దగ్గర భారీ పేలుడు నేపథ్యంలో పట్టణంలో పలు చోట్ల ఆకస్మిక తనిఖీలు చేపట్టినట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఢిల్లీలో జరిగిన భారీ పేలుడు సందర్భంగా పట్టణంలోని బస్టాండ్, బస్టాండ్ అవరణలోని సైకిల్ స్టాండ్, శివ సర్కిల్, సోమప్ప సర్కిల్, శ్రీనివాస సర్కిల్‌ల నందు వాహనాల ఆకస్మిక తనిఖీలు చేపట్టామన్నారు. ఎవరైనా అనుమానాస్పదంగా కనిపించిన, రోజుల తరబడి ఏదైనా వాహనం అనుమానాస్పదంగా ఒకే చోటనే ఉంచినట్లు ఎవరైనా, ఎక్కడైనా గమనించినట్లయితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఎస్సై శ్రీనివాసులు, ఏఎస్సై కిష్టప్ప పాల్గొన్నారు.

మంత్రాలయంలో...

మంత్రాలయం: ఢిల్లీలో ఎర్రకోట సమీపంలో జరిగిన భారీ పేలుళ్ల దృష్ట్యా మంత్రాలయంలో పోలీసులు అలర్ట్ అయ్యారు. సోమవారం రాత్రి జిల్లా పోలీసుల అధికారుల ఆదేశాల మేరకు ప్రముఖ పుణ్యక్షేత్రం కావటంతో వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే వాహనాలను మంత్రాలయం ఎస్ఐ శివాంజల్, తన సిబ్బందితో తనిఖీ చేశారు. రాత్రి 7.30గంటల నుంచి 11 గంటల వరకు ముమ్మరంగా సోదాలు చేశారు. మంగళవారం శ్రీమఠం అధికారులతో సమావేశమై శ్రీమఠం భద్రత దృష్ట్యా కర్నూలు నుంచి డాగ్‌స్క్వాడ్, బాంబు స్క్వాడ్‌లతో మంత్రాలయాన్ని జల్లెడ పడుతున్నట్లు తెలిపారు. అనుమానితులు ఎవరైనా కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఆయా లాడ్జి యజమానలకు, భక్తులకు, ప్రజలకు మైకుల ద్వారా హెచ్చరికలు జారీ చేశారు. ఈతనిఖీలో హెడ్ కానిస్టేబుల్ అంజనేయులు, వెంకటేశ్వర్లు , సురేంద్ర, ప్రతాప్, జమీర్, నాగేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మంత్రాలయంలో వాహనాన్ని తనిఖీ చేస్తున్న ఎస్ఐ

ఆర్అండ్‌బీ రోడ్డును కాపాడండి



తహసీల్దారుకు వినతి పత్రం అందజేస్తున్న సున్నం రఘు

మంత్రాలయం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం పుణ్యక్షేత్రంలో ప్రధాన రహదారి సర్వే నెంబర్ 54లో కబ్జాకు గురైన రోడ్డును కాపాడాలని మంత్రాలయానికి చెందిన టీడీపీ నాయకులు సున్నం రఘు అధికారులను కోరారు. సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో తహసీల్దారు రమాదేవికి వినతి పత్రం ఇచ్చారు. సర్వే నెంబరు 54లోని 80 అడుగుల వెడల్పు ఉన్న రోడ్‌ను అక్రమణ చేస్తే పట్టించుకునేవారే లేరన్నారు. ఆక్రమణలు తొలగించాలని హైకోర్టు, సుప్రీం కోర్టుల ఆదేశా లు ఉన్నప్పటికీ పట్టించుకునేవారు లేరని వాపోయారు. రోడ్డును కాపాడాలని కోరారు.

'పాఠశాలను సీజ్ చేయాలి'



కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

నందవరం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ ప్రైవేటు పాఠశాలను వెంటనే సీజ్ చేయాలని ఆర్‌పీఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రఘునాథ్ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఆయన మాట్లాడుతూ పాఠశాలలో సరైన సదుపాయాలు లేవని, ప్రభుత్వం నుంచి అనుమతి కూడా లేదన్నారు. అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు.

విద్యార్థులకు తాగునీటి సౌకర్యం కల్పిస్తాం

మంత్రాలయం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): చౌళహళ్లి గ్రామ పాఠశాల విద్యార్థులకు తాగునీటి సౌకర్యం కల్పిస్తామని ఎంఈఓ రాఘన్న అన్నారు. సోమవారం మంత్రాలయం మండలంలోని చౌళహళ్లి, సుంకేశ్వరి జడ్పీ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు హాజరు, విద్య బోధన,మధ్యాహ్న భోజనం, పరిశుభ్రత,పరీక్షలనిర్వహణ, ఆయా పనితీరును పరిశీలించారు. చౌళహళ్లి పాఠశాలలో తాగునీటిపై సర్పంచు రాధ, వీఆర్‌వో ప్రభకర్, విద్యాకమిటీ చైర్మన్, గ్రామ కార్యదర్శితో మాట్లాడి సమస్యలను పరిష్కరించారు. సుంకేశ్వరి ఉన్నత పాఠశాలలో పదో తరగతి వందశాతం ఉత్తీర్ణతకు ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. తనిఖీలో లక్ష్మిరెడ్డి, హెచ్‌ఎంలు భీమయ్య, ఖాదర్‌బాషా, రాజశేఖర్‌గౌడు, శ్రీనివాసులు, మద్దిలేటి, సుమలత తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మూలరాములకు కనకాభిషేకం

● ధాత్రి హోమానికి పీఠాధిపతి పూర్ణాహుతి



పూజలు చేస్తున్న పీఠాధిపతి

మంత్రాలయం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): వేదపండితుల మంత్రోచ్ఛరణాలు, మంగళ వాయిద్యాలు మధ్య మూలరాములకు పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు బంగారు నాణేలతో వైభవంగా అభిషేకం నిర్వహించారు. సోమవారం మంత్రాలయం సమీపంలో అభయఅంజనేయ స్వామి వెనుక ఉన్న ఉసిరివనంలో కార్తీకమాస శుభ సందర్భాన్ని పురస్కరించుకొని శ్రీమఠం ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉసిరిచెట్టుకు పూజలు చేశారు. అందరికి శుభం కలగాలని దాత్రి హోమం నిర్వహించి పూర్ణాహుతి చేశారు. పీఠాధిపతి మూలరాములు, జయరాములు, దిగ్విజయరాములకు అభిషేకం చేశారు. అనంతరం వన భోజనం చేశారు. ఈకార్యక్రమంలో పండితకేసరి, విద్వాన్ రాజాఎస్ గిరి రాజాచార్,అప్రమేయచార్, శ్రీపతిఆచార్,ఐపీ నరసింహమూర్తి, జేపీ స్వామి, ప్రకాష్ ఆచార్, ద్వారపాలక అనంతస్వామి, వరధేంద్రాచార్,పవన్ఆచార్, రవికులకర్ణి,విజయేంద్ర ఆచార్ పాల్గొన్నారు.

జాబ్‌కార్డులు ఎందుకు తొలగించారు?



ఎంపీడీవోతో వాగ్వాదం చేస్తున్న అలువాల గ్రామస్థులు

గోనెగండ్ల, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): తాము ఏ తప్పుచేశామని జాబ్ కార్డులు తొల గించారని ఉపాధి కూలీలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని అలువాలకి చెందిన గ్రామ పెద్దలు, కూలీలు సోమవారం ఎంపీడీవో కార్యాలయానికి చేరుకొని ఎంపీడీవో మణిమంజరి, ఏపీవో మహబూబ్ బాషాతో వాగ్వాదానికి దిగారు. అలువాలలో 800 జాబ్ కార్డులు 1600 మంది ఉపాధి కూలీలు ఉన్నారు. ఉపాధి అధికారుల చేపట్టే పనులకు హాజరవుతున్నారు. అఇటీవల ఉపాధి పనులు చేయించే సిబ్బందిలో రెండు వర్గాలు ఏర్పడాయి. ఉపాధి సిబ్బంది ఏదో కారణం చూపి 200 మంది ఉపాధి కూలీలను మూడు రోజుల క్రితం ఉపాధి పనుల నుంచి తొలగించారు. గ్రామానికి చెందిన కొందరు కూలీలు బతుకు తెరువుకోసం వలస బాట పట్టారు. మరికొందరు అధికారులను ప్రశ్నించడంతో వాదన చోటుచేసుకున్నది.

ఉపాధి కూలీలను తొలగించడం: వలసలను నివారించే కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో ఉపాధి పనులు చేపట్టే విధంగా జిల్లా ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటుంటే అందుకు వ్యతిరేకంగా అలువాలలో ఉపాధి కూలీలను పనులకు రాకుండా తొలగించడం ఏమిటని పలు ప్రజాసంఘాలు విమర్శిస్తున్నాయి. గోనెగండ్ల మండలం నుంచి దాదాపు 5000 మంది వరకు వలసలు వెళ్లినట్లు తెలుస్తుంది.

విచారణ చేపడుతాం

రెండు రోజుల్లో గ్రామానికి వచ్చి కూలీలతో విచారణ చేపడుతాం. ఉపాధి పనుల నుంచి ఎంతమందిని తొలగించారు? ఎందుకు తొలగించారో తెలుసుకుంటా. అనవసరంగా తొలగించినట్లు విచారణలో తెలితే బాధ్యులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటా.

● మణిమంజరి, ఎంపీడీవో, గోనెగండ్ల

బస్సు సౌకర్యం కల్పించాలి



తహసీల్దార్ శేషఫణికి వినతిపత్రం అందజేస్తున్న విద్యార్థి సంఘం నాయకులు

ఎమ్మిగనూరు రూరల్, నవంబరు 10 (ఆంధ్ర జ్యోతి): ఎమ్మిగనూరు మండలంలోని ఎర్రకోట, కడిమెట్ల గ్రామాలకు ఆర్టీసీ అధికారులు బస్సు సౌకర్యం కల్పించాలని ఆర్‌పీఎస్‌ఎఫ్ డివిజన్ అధ్యక్షులు విష్ణు డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్ శేషఫణిని కలిసి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ వందలమంది విద్యార్థులు ఉన్నత చదువుల కోసం నిత్యం ఎమ్మిగనూరు, ఆదోని పట్టణాలకు ఎర్రకోట, కడిమెట్ల గ్రామాల నుంచి వస్తుంటారన్నారు. అయితే వీరికి సరైన సమయానికి బస్సు సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వెంటనే ఆర్టీసీ అధికారులు స్పందించి బస్సు సౌకర్యం కల్పించాలన్నారు. కార్యక్రమంలో సుధాకర్, రంగస్వామి, రాజు పాల్గొన్నారు.

ముగిసిన తేనెటీగల పెంపకం శిక్షణ



శిక్షణ పొందిన రైతులకు సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

ఎమ్మిగనూరు రూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు మండల పరిధిలోని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రంలో ప్రారంభమైన తేనెటీగల పెంపక శిక్షణా కార్యక్రమం సోమవారంతో ముగిసింది. గత వారం రోజుల క్రితం ప్రారంభమైన ఈ కార్యక్రమానికి రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న రైతులకు బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ రాఘవేంద్ర చౌదరి సర్టిఫికెట్లను అందజేశారు. ఆయన మాట్లాడుతూ తేనెటీగల పెంపకంతో రైతులు ఆర్థికాభివృద్ధిని సాధించాలన్నారు. కార్యక్రమంలో నంద్యాల శాస్త్రవేత్తలు డా.ఎం. వెంకటరమణమ్మ, నజీరుద్దీన్ పాల్గొన్నారు.

16న వాల్మీకి వనభోజనాలు

ఎమ్మిగనూరు టౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : వాల్మీకి వనభోజన సమితి అధ్వర్యంలో 16న కార్తీక వనభోజనాల సమ్మేళనం జరుగుతున్నట్లు వాల్మీకి వనభోజన సమితి నిర్వాహకులు వీజీ ఆర్ కొండయ్య, నారాయణ, రాఘవన్ తెలిపారు. స్థానిక పోస్టు ఆఫీసు ఎదురుగా వాల్మీకి సంక్షేమ భవన్‌లో వారు మాట్లాడుతూ వనభోజనానికి వాల్మీకులందరూ హాజరు కావాలని కార్యక్రమంలో జగదీష్, దెవేంద్ర, రామాంజనేయులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు చరణ్‌సాయి



ఉపాధ్యాయులతో ట్రోఫీ అందుకుంటున్న చరణ్‌సాయి

ఎమ్మిగనూరు టౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి చరణ్‌సాయి రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు ఎంపికైనట్లు హెడ్ మాస్టర్ శకుంతల ఫిజికల్ డైరెక్టర్ శ్రీనివాసులు, సౌమ్య తెలిపారు. సోమవారం స్థానిక సోమప్ప నగర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు ఎంపికైన చరణ్‌సాయిని అభినందించారు. 23,24న బాపట్ల జిల్లా చందులూరులో జరిగే రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మధుసూదన్‌రెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

గోనెగండ్ల, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): గోనెగండ్లలో నెలకొన్న పలు సమస్యలను అధికారులు వెంటనే పరిష్కరించాలని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఖాసీం వలి అన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ గోనెగండ్లలో బస్టాండ్ ప్రాంగణంలో సులబ్ కాంప్లెక్స్ లేకపోవడంతో ప్రయాణికులు మహిళలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అలాగే ఆసుపత్రి ప్రాంగణంలో మలమూత్రవిసర్జన చేస్తుండడంతో ఆ ప్రాంతం అంతా దుర్గంధభరితంగా మారిపోయిందన్నారు. 30 పడకల ప్రభుత్వ ఆసుపత్రి నేడు కేవలం 6 పడకల ఆసుపత్రిగా మారిపోయిందన్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.

గోనెగండ్ల ఎంపీడీవో ఆఫీస్ ఏవోగా శ్రీధర్‌రెడ్డి



గోనెగండ్ల, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): గోనెగండ్ల మండల ఎంపీడీవో ఆఫీస్ ఏవోగా శ్రీధర్‌రెడ్డి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన గడివేముల నుంచి ఇక్కడికి పదోన్నతిపై వచ్చారు. ఇక్కడ ఏవో పనిచేస్తున్న సౌభాగ్యలక్ష్మి డ్వామా బదిలీపై వెళ్లారు. ఆయన శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ గోనెగండ్ల మండల ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

ఘనంగా ఏకాదశ రుద్ర హోమాలు



సామూహిక హోమాల్లో పాల్గొన్న భక్తులు

ఎమ్మిగనూరు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వీవర్స్ కాలనీ మైదానంలో 87వ విశ్వశాంతి మహాయాగంలో భాగంగా సోమవారం ఏకదశ రుద్రహోమాలు, విశేష రుద్రాభిషేకాలు ఘనంగా నిర్వహించారు. ముందుగా విఘ్నేశ్వరునిపూజలు నిర్వహించారు. అనంతరం యాగశాలలో భక్తులకు ఏర్పాటు చేసిన హోమ గుండాల దగ్గర సామూహిక హోమాల్లో భక్తులు పాల్గొని హోమాలు చేశారు. అలాగే ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన యాగశాలల్లో వేదపండితులు మంత్రోచ్ఛారణలు, వేదమంత్రాలతో యాగం నిర్వహించారు. అలాగే శివలింగాభిషేకంలో పాల్గొని భక్తులు అభిషేకం చేశారు. మాజీ ఎంపీ, వైసీపీ కర్నూలు పార్లమెంటు సమన్వయకర్త బుట్టా రేణుక, ఆమె భర్త బుట్టా శివనీలకంఠలు హోమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

జీతాలు వెంటనే ఇవ్వాలి: ఎస్టీయూ

నందవరం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ ఉపాధ్యాయులకు జీతాలు వెంటనే ఇవ్వాలని ఎసీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జనార్ధన్ అన్నారు. సోమవారం నందవరంలో ఎస్టీయూ బసవరాజు ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం జరిగింది. నూతన కమిటీని ఎన్నుకున్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా వెంకటేశ్వర్లు, రాష్ట్ర కౌన్సిలరుగా బసవరాజు, ప్రసన్నరాజును ఎన్నుకున్నారు. అలాగే నందవరంలో నూతన కార్యవర్గన్ని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా లక్ష్మీనారాయణ, అధ్యక్షుడిగా మోనే నరసప్ప, ప్రదాన కార్యదర్శిటా మహబూబ్‌బాషా, ట్రెజరిగా ఆశోక్‌కుమార్ అలాగే కార్యవర్గన్ని ఎన్నుకున్నారు.